# మహిళా బిల్లుపై మాటల యుద్ధం

## కేంద్రమంత్రి కిరణ్ రిజిజుకు రాహుల్ కౌంటర్

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

మహిళా రిజర్వేషన్ అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి మాటల యుద్ధం మొదలైంది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు.. 'ఎక్స్' సోషల్ మీడియా వేదికగా పరస్పరం స్పందించారు. మహిళా శక్తిపై రాహుల్ వ్యాఖ్యలను స్వాగతించిన రిజిజు.. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ బేషరతుగా మద్దతివ్వాలని కోరారు. దీనికి ఘాటుగా బదులిచ్చిన రాహుల్.. మహిళలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచేందుకు అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు. వీడియోపై రిజిజు స్పందిస్తూ.. 'కాంగ్రెస్ పార్టీలో ఇది సానుకూల సందేశంగా కనిపిస్తోంది. రాహుల్ వైఖరిలో మహిళల విషయంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది' అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఇదే సమయంలో మహిళా రిజర్వేషన్ అంశాన్ని ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఎలాంటి షరతులు లేకుండా మద్దతివ్వాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. రిజిజు వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ వెంటనే స్పందించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును 2023లోనే పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిందని గుర్తుచేశారు. 'పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా మీకంటే ఈ విషయం బాగా ఎవరికి తెలుస్తుంది? మహిళా రిజర్వేషన్ చట్టం–2023 కాంగ్రెస్ పూర్తి మద్దతుతో ఏకగ్రీవంగా ఆమోదమైంది. అయినా మూడేళ్లు గడిచినా ఎందుకు అమలు చేయలేదు? ఇప్పుడు దాన్ని డీలిమిటేషన్‌తో అనవసరంగా ఎందుకు ముడిపెడుతున్నారు?' అని ప్రశ్నించారు. మహిళలకు రిజర్వేషన్ కల్పించే 2023 చట్టాన్ని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాహుల్ విడుదల చేసిన ఈ వీడియోలో మహిళల సామర్థ్యంపై విస్తృతంగా ప్రసంగించారు. దేశంలోని మహిళల శక్తి ఇంకా పూర్తిస్థాయిలో బయటకు రాలేదన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే మహిళలు తమ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తం చేయాలని, తమకు నచ్చిన రంగాల్లో ముందుకు సాగేందుకు అవకాశం ఉండాలని పేర్కొన్నారు. మహిళలు.. వ్యాపారం, రాజకీయాల్లో రాణించడమే కాకుండా.. ఇళ్లలోనూ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పగలగాలని, సమాజంలో ఎలాంటి భయం లేకుండా తిరగగలగాలని చెప్పారు. పితృస్వామ్య భావజాలం, మహిళలపై ఉండే కఠిన నియంత్రణ నుంచి కొంత విముక్తి అవసరమని రాహుల్ అభిప్రాయపడ్డారు. మహిళా శక్తి, మహిళా రిజర్వేషన్ అంశాలపై రాహుల్ చేసిన వరుస వ్యాఖ్యల నేపథ్యంలో.. కేంద్రంతో కాంగ్రెస్ మధ్య రాజకీయ వాగ్వాదం మరోసారి తెరపైకి వచ్చింది.

# హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాలు

## వేలదిగా తరలివచ్చిన నిరుద్యోగులు

## సరూర్ నగర్ స్టేడియంలో తోపులాట



**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

నగరంలోని సరూర్‌నగర్ స్టేడియం వద్ద తోపులాట జరిగింది. హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు పోటెత్తారు. శనివారం, ఆదివారం డ్రైవర్ల ఎంపిక ఉంటుందని హైడ్రా ప్రకటించింది. దీంతో ఇందులో పాల్గొనేందుకు నిరుద్యోగులు భారీగా తరలిరావడంతో తోపులాట జరిగింది. ఇటీవల హైడ్రా విడుదల చేసిన 150 డ్రైవర్ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన రిక్రూట్‌మెంట్ పక్రియ తీవ్ర గందగోళానికి దారి తీసింది. డ్రైవర్ పోస్టల కోసం రాష్ట్రంలోని నలుమూల నుంచి వేలాది మంది నిరుద్యోగ యువత శనివారం తెల్లవారుజామున 4 గంటల నుంచే భారీగా సరూర్‌నగర్ స్టేడియానికి చేరుకున్నారు. కేవలం 150 పోస్టులు ఉండగా.. ఊహించిన రీతిలో వేలాది మంది పోటెత్తడంతో స్టేడియం మొత్తం నిరుద్యోగులతో కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో కొంత ఉద్రిక్తత, తోపులాట చోటుచేసుకుంది. గంటల తరబడి లైన్లలో వేచి ఉన్నప్పటికీ అధికారుల వైపు నుంచి సరైన ఏర్పాట్లు లేకపోవడంతో నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. కనీసం తాగడానికి మంచి నీరు కూడా ఏర్పాటు చేయకపోవడంతో లైన్లలో వేచి ఉన్న యువత.. నిర్వాహకుల తీరుపై ఆందోళనకు దిగారు. ఉద్యోగం కోసం జిల్లాలు దాటి వస్తే అధికారులు నిర్లక్ష్యంగా ప్రవర్తించారంటూ నిరుద్యోగులు వాపోతున్నారు. వెంటనే స్థానిక పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం అభ్యర్థులకు టోకెన్ ఇచ్చి వెనక్కి పంపిస్తున్నట్లు తెలుస్తోంది. టోకెన్‌లో చెప్పిన టైమ్ ప్రకారం అక్కడకు వచ్చి ఈవెంట్స్‌లో పాల్గొనాలని నిర్వాహకులు చెబుతున్నారు.

# ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

## 15 ఆగస్టన ప్రారంభించనున్న సిఎం

**నిజామాబాద్, అక్షరకలం ప్రతినిధి**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్డ్ రేషన్ కార్డుల పంపిణీకి జిల్లా పౌర సరఫరాల శాఖ సన్నద్ధమవుతోంది. స్మార్ట్ కార్డు విషయంలో దాదాపు 8 నెలల నుంచి ప్రభుత్వం చేసిన ఆలోచన ఎట్టకేలకు కార్యరూపం దాల్చనుంది. ఆగస్ట్ 15న సంగారెడ్డిలో సిఎం వీటిని ప్రారంభిస్తారు. ఈ స్మార్ట్ కార్డులతో బోగస్ కార్డుల ఎత్తివేత సులువవుతందని భావిస్తున్నారు. జిల్లాల వారిగా స్మార్డ్ కార్డు పంపిణీ అంశంపై శ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పౌరసరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ఆగస్టు 15 నుంచి స్మార్ట్ కార్డులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభిస్తారు. అదేరోజున మిగతా జిల్లాల్లో కూడా ప్రజా ప్రతినిధులు కార్డుల పంపిణీని లాంఛనంగా చేపడతారు. అయితే పంపిణీ వేదికలు, ఏర్పాట్లు తదితర అంశాలపై ఈనెల 11 వరకు స్పష్టత రానుంది. స్మార్ట్ రేషన్ కార్డు ఆకర్షణీయంగా ఉండనుంది. డ్రైవింగ్ లైసెన్స్, క్రెడిట్, డెబిట్ కార్డు సైజులో ఈజీగా వాలెట్‌లో పెట్టుకు నేలా ప్రభుత్వం రూపొందించింది. ఆధునిక సాంకేతిక విలువాలతో కార్డు ఆకర్షణీయంగా ఉంటుందని అధికా రులు అంటున్నారు. కొత్త కార్డుల దరఖాస్తు నిరంతర పక్రియ కావడంతో కార్డుల సంఖ్య పెరుగుతూనే ఉంటుంది. నిజామాబాద్ జిల్లాలో ప్రస్తుతం ఉన్న కార్డుల స్థానే కొత్త కార్డులను అందిస్తారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా అధికారులు జాబితాను సిద్ధం చేశారు.

# కాంగ్రెస్ 'మొహబ్బత్ కీ దుకాణ్' అసలు రంగు ఇదే: టి. బీజేపీ చీఫ్

హైదరాబాద్,

సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగ యువతపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం తీవ్ర బాధాకరమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత ధోరణిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాహుల్ గాంధీ ఢిల్లీలో 'మొహబ్బత్ కీ దుకాణ్' అని గొప్పలు చెప్తూ, తెలంగాణలో మాత్రం ఉపాధి కోరిన యువతపై లాఠీలు ఝళిపిస్తున్నారని విమర్శించారు. హైడ్రాలో కేవలం 150 ఖాళీల కోసం వేలాది మంది యువత తరలిరావడం రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగ తీవ్రతకు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి సాక్ష్యమని రామచందర్ రావు అన్నారు. అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్, నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి, స్వయం ఉపాధికి రూ.10 లక్షల వడ్డీ లేని రుణాలు ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని గుర్తు చేశారు. అయితే రెండేళు గడిచినా ఒక్క హామీనీ నెరవేర్చలేదని ఆయన మండిపడ్డారు. హామీలను నమ్మి ఓటేసిన యువతను రోడ్లపాలేసి, కనీసం ఆశతో వచ్చిన వారిపై పోలీసులతో దౌర్జన్యం చేయించడం అన్యాయమని రామచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ యువత ఆకాంక్షలపై అధికారంలోకి వచ్చారో, అదే యువత భవిష్యత్తును కాంగ్రెస్ ప్రభుత్వం అంధకారంలోకి నెట్టివేసిందని ఆరోపించారు. ఉద్యోగాల కోసం వచ్చిన అభ్యర్థులపై పోలీసుల ప్రయోగంపై కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు, యువతకు సమాధానం చెప్పాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు.

# నిరుద్యోగులంటే ఎందుకింత కక్ష


## సరూర్ నరగ్ ఘటన ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే

## రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ హామీ మోసానికి నిదర్శనం

## ఎక్స్ వేదికగా మండిపడ్డ బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీకి వచ్చిన నిరుద్యోగులను ప్రభుత్వం అవమానించిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. విద్యార్థులు, నిరుద్యోగులు అంటే ప్రభుత్వానికి ఎందుకింత కక్ష అంటూ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేస్తూ.. 32 నెలలు దాటినా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్ అయ్యిందంటూ ఫైర్ అయ్యారు. అధికారం కోసం ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను నెత్తిన పెట్టుకున్నారు. ఉద్యోగాలు ఇస్తామని హామీలు గుప్పించారు. ఇప్పుడు అదే నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రోడ్ల మీదకు వస్తే వారి పట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా అని ప్రశ్నించారు. హైడ్రాలో కేవలం 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు తరలివచ్చారు. ఇది నిరుద్యోగుల తప్పా లేక



ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన మీ ప్రభుత్వం తప్పా అని అన్నారు. ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులను ముఖ్యమంత్రి స్థాయిలో 'క్రిమినల్ వేస్ట్' అని అవమానించడం, ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులను అధికారులు దుర్భాషలాడటం చూస్తుంటే 'యథా రాజా.. తథా అధికారులు' అన్న సామెత గుర్తుకొస్తోంది. అధికారుల నోటివెంట ఇలాంటి మాటలు రావడం మరింత బాధాకరం. ఉద్యోగం కోసం వచ్చిన యువతను గౌరవంగా చూడాల్సిన అధికారులు వారినే అవమానిస్తే ఇక ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తున్నట్టు అని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు నిజంగా భర్తీ చేసి ఉంటే.. ఈరోజు 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాది మంది నిరుద్యోగులు ఇలా క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చేదా అని అన్నారు. నీ రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్. నీ జాబ్ క్యాలెండర్ బోగస్. నిరుద్యోగులకు నువ్వు ఇచ్చిన హామీలు బోగస్. మీ పాలనలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో నిరాశ పెరుగుతోంది. నోటిఫికేషన్లు సక్రమంగా రాకపోవడం తో పీజీ, పీహెచ్డీ వంటి ఉన్నత విద్య చదివిన యువత కూడా చిన్నచిన్న పోస్టుల కోసం పోటీ పడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులపై అనుచితంగా, అసభ్యంగా మాట్లాడిన అధికారులపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. వారిని అవమానించినందుకు విద్యార్థి, నిరుద్యోగలోకానికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి' అంటూ ఎక్స్‌లో హరీశ్ రావు పోస్ట్ చేశారు. హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీ సందర్భంగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద జరిగిన ఘటనలపై హరీశ్ రావు 'ఎక్స్'వేదికగా స్పందించారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని.. ఉద్యోగాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు.

# మాకు క్షుద్ర రాజకీయాలు తెలియవు: కేటీఆర్

హైదరాబాద్,

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు క్షుద్ర రాజకీయాలు తెలియవు అని పేర్కొన్నారు. క్షుద్ర పూజలంటూ కాంగ్రెస్ నేతలు క్షుద్ర రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈరోజు (శనివారం) తెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. మాజీ మంత్రి హరీశ్‌రావు గుడికి వెళ్లడం తప్పా? అని ప్రశ్నించారు.

**రైతులపై రేవంత్‌రెడ్డికి కనీస పరిజ్ఞానం లేదు..**

స్ట్రెయిట్ రాజకీయాలు మాత్రమే తమకు తెలుసునని కేటీఆర్ స్పష్టం చేశారు. రైతులపై రేవంత్‌రెడ్డికి కనీస పరిజ్ఞానం లేదని తెలిపారు. తాము డిమాండ్ చేస్తేగానీ పంప్‌లు ఎందుకు ఆన్ చేయలేదని ప్రశ్నించారు. సీఎంకు ఎప్పుడు నీళ్లు ఎత్తిపోయాలో కూడా తెలియదని విమర్శించారు. హరీశ్‌రావు ఈ విషయంపై ప్రశ్నించినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. సీఎం రేవంత్ దృష్టిలో భూమి అంటే రియల్ ఎస్టేట్ అని ఎద్దేవా చేశారు. +=వీదీ ఎజెండాలో 7 వివాదాస్పద అంశాలు ఉన్నాయని కేటీఆర్ ప్రస్తావించారు.

# ద్రోహులనే కలుస్తారా.. విద్యార్థులను కలవరా: ప్రధానిపై ఉద్ధవ్ విమర్శలు..

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే తీవ్ర విమర్శలు చేశారు. నిరసనలు చేస్తున్న యువతను కలవడానికి ప్రధానమంత్రికి సమయం ఉండటం లేదని, కానీ తమ పార్టీని వీడి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరిన ఎంపీలను కలవడానికి మాత్రం సమయం కేటాయిస్తున్నారని ఆరోపించారు. ముంబైలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉద్ధవ్ ఠాక్రే ఈ వ్యాఖ్యలు చేశారుమహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరిన తమ పార్టీకి చెందిన ఆరుగురు లోక్‌సభ ఎంపీలను ఇటీవల ప్రధానమంత్రి మోదీ కలవడంపై ఉద్ధవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రధానమంత్రికి యువతను కలిసేందుకు సమయం లేదు. కానీ తిరుగుబాటుదారులను కలవడానికి సమయం ఉంది' అంటూ ఉద్ధవ్ విమర్శించారు షిండే నేతృత్వంలోని శివసేనకు 'అసలైన శివసేన'గా గుర్తింపు ఇచ్చిన ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాలు చేస్తూ తమ వర్గం దాఖలు చేసిన పిటిషన్లు సుప్రీంకోర్టులో విచారణలో ఉన్న సమయంలో ఈ భేటీ ఎందుకు జరిగిందని ఉద్ధవ్ ప్రశ్నించారు (మీఖ్షుతీఖుంప్త్రీఖు జూశీశ్రీ‌ఱఎం). సుప్రీంకోర్టుపై ఒత్తిడి తీసుకురావడానికి చేసిన ప్రయత్నమే ఈ భేటీనా అని ఆయన ప్రశ్నించారు. శివసేనలో చీలిక తర్వాత ఉద్ధవ్ ఠాక్రే, ఏక్‌నాథ్ షిండే వర్గాల మధ్య రాజకీయ పోరు కొనసాగుతోంది. ఇటీవల ఉద్ధవ్ వర్గానికి చెందిన ఆరుగురు లోక్‌సభ ఎంపీలు షిండే నేతృత్వంలోని శివసేనలో చేరడం ఈ వివాదాన్ని మరింత తీవ్రం చేసింది.

# ఫేక్ సర్టిఫికెట్లతో 'జేఎల్' ఉద్యోగాలు !

## ఉమ్మడి నల్గొండ జిల్లాలో ముగ్గురికి షోకాజ్ నోటీసులు

## ఇతర రాష్ట్రాల నకిలీ పీజీ పత్రాలతో ఉద్యోగాల్లో తిష్ట

## రాష్ట్రవ్యాప్తంగా 37 మందిపై ఇంటర్ బోర్డు వేటుకు సిద్ధం

## వారం రోజుల్లో ఆధారాలు చూపాలని స్పష్టీకరణ

## మరోవైపు ఎస్ బి వెరిఫికేషన్ పూర్త్యయ్యేలా డిక్లరేషన్ ఇవ్వాలంటున్న సంఘాలు

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**


ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యాబుద్ధులు నేర్పించాల్సిన అధ్యాపకులే నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన తీరు తీవ్ర కలకలం రేపుతోంది. అర్హత లేకపోయినా ఇతర రాష్ట్రాల విశ్వవిద్యాలయాల పేరుతో బోగస్ పీజీ, విద్యార్హతల పత్రాలను సృష్టించి ప్రభుత్వ ఉద్యోగాల్లో తిష్టవేసిన పలువురు జూనియర్ లెక్చరర్ల (జేఎల్) భాగోతం ఎట్టకేలకు వెలుగులోకి వచ్చింది. ఈ అక్రమాలకు సంబంధించి ఇంటర్మీడియట్ విద్యా మండలి (ఇంటర్ బోర్డు) రాష్ట్రవ్యాప్తంగా విచారణ వేగవంతం చేసి ముమ్మర చర్యలకు శ్రీకారం చుట్టింది.

**క్రమబద్ధీకరణ వెనుక బోగస్ పత్రాలు!**

గతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుదీర్ఘకాలం పాటు కాంట్రాక్ట్ లెక్చరర్లుగా సేవలందించిన వారి కష్టాలను పరిగణనలోకి తీసుకుని, అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం వారి ఉద్యోగాలను రెగ్యులరైజ్ (క్రమబద్ధీకరణ) చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ క్రమబద్ధీకరణ ప్రక్రియనే ఆసరాగా చేసుకుని కొంతమంది నకిలీ దందాను నడిపినట్లు అధికారులు గుర్తించారు. నిబంధనల ప్రకారం జూనియర్ లెక్చరర్ పోస్టుకు సంబంధిత సబ్జెక్టులో గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి పీజీ పూర్తి చేసి ఉండాలి. కానీ, అర్హత లేని కొందరు అధ్యాపకులు బయటి రాష్ట్రాల్లోని పలు ప్రైవేటు/డీమ్డ్ విశ్వవిద్యాలయాల నుంచి అక్రమ మార్గంలో పొందిన నకిలీ పీజీ పట్టాలను, ఇతర కోర్సు సర్టిఫికెట్లను ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించి ఉద్యోగాలు క్రమబద్ధీకరించుకున్నట్లు విచారణలో తేలింది.

**రంగంలోకి ఇంటర్ బోర్డు.. 37 మందికి షోకాజ్!**

ఈ నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంపై ఫిర్యాదులు రావడంతో ఇంటర్మీడియట్ శాఖ ఉన్నతాధికారులు లోతుగా తనిఖీలు చేపట్టారు. సర్టిఫికెట్ల ఆన్‌లైన్ తనిఖీ, సంబంధిత విశ్వవిద్యాలయాల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా 37 మంది కాంట్రాక్ట్/రెగ్యులర్ లెక్చరర్లు నకిలీ విద్యార్హత పత్రాలు సమర్పించినట్లు ప్రాథమికంగా ఆధారాలు లభించాయి. దీంతో ఇంటర్ బోర్డు సదరు 37 మందికి ముందస్తు హెచ్చరిక (షోకాజ్) నోటీసులు జారీ చేసింది.





**ఉమ్మడి జిల్లాలో ముగ్గురికి నోటీసులు...**

ఇంటర్ బోర్డు జారీ చేసిన షోకాజ్ నోటీసులలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ముగ్గురు జూనియర్ లెక్చరర్లు ఉండటం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న ఫిజిక్స్ (భౌతికశాస్త్రం) అధ్యాపకులు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన సీటీ (ఒకేషనల్ కోర్స్) అధ్యాపకులు, సూర్యాపేట జిల్లా పరిధిలోని నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్న బాటనీ (వృక్షశాస్త్రం) అధ్యాపకులు.ఈ ముగ్గురు అధ్యాపకులకు నోటీసులు అందిన విషయాన్ని సంబంధిత ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు సైతం ధ్రువీకరించారు.

**వారం రోజులే గడువు...**

నోటీసులు అందుకున్న అధ్యాపకులు వారం రోజుల్లోగా (7 రోజులు) తమ విద్యార్హతలకు సంబంధించిన పూర్తి అసలైన ఆధారాలు, అధ్యయన పత్రాలను ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించాలని అధికారులు స్పష్టం చేశారు. అధ్యాపకులు ఇచ్చే వివరణ, వారు చూపే ఆధారాలను విద్యాశాఖ నిపుణులు పునఃపరిశీలిస్తారు. నిర్ణీత గడువులోగా సరైన ఆధారాలు చూపని పక్షంలో లేదా వివరణ సంతృప్తికరంగా లేకపోతే వారి ఉద్యోగాలను రద్దు చేయడంతో పాటు, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశం ఉందని సమాచారం.

**ఎస్ బి వెరిఫికేషన్ పూర్తి చేయాలని వినతులు...**

ఒకవైపు నకిలీ సర్టిఫికెట్ల బాగోతం విద్యాశాఖలో కలకలం రేపుతుండగానే, మరోవైపు నిజాయితీగా పనిచేస్తున్న అర్హులైన అధ్యాపకులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధ్యాపక సంఘాలు కోరుతున్నాయి. కొత్తగా క్రమబద్ధీకరించబడిన అధ్యాపకుల స్పెషల్ బ్రాంచ్ (ఎస్ బి ) పోలీస్ వెరిఫికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు. పోలీస్ తనిఖీలు పూర్తయితే తప్ప ప్రొబేషన్ డిక్లేర్ కాదని, దీనివల్ల అర్హులైన అధ్యాపకుల ఇంక్రిమెంట్లు, సర్వీసు ప్రయోజనాలు ఆగిపోతున్నాయని సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఎస్ బి సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసి, అర్హులైన అధ్యాపకుల ప్రొవిజనల్ పీరియడ్‌ను అధికారికంగా డిక్లేర్ చేయాలని అధ్యాపక సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని, విద్యాశాఖ అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆగస్టు 10న చలో జైల్‌భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

## సీఐటీయూ త్రీటౌన్ హమాలీ కమిటీ ఆధ్వర్యంలో సన్నాహక జనరల్‌బాడీ సమావేశం

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :**

ఖమ్మం, ఆగస్టు 10న నిర్వహించనున్న చలో జైల్‌భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ త్రీటౌన్ హమాలీ కమిటీ నాయకులు కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక త్రీటౌన్ ఏరియాలో సీఐటీయూ త్రీటౌన్ కమిటీ, హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో సన్నాహక జనరల్‌బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ జనరల్‌బాడీ సమావేశానికి భూక్య శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో ముఖ్య అతిథులుగా రైతు సంఘశీ రాష్ట్ర నాయకులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఎర్ర శ్రీనివాసరావు, అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, సీ.ఐ.టీ.యూ జిల్లా అధ్యక్షులు తుమ్మ విష్ణు, జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు, పేద ప్రజలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆగస్టు 10న చలో జైల్‌భరో కార్యక్రమంలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల ఐక్యతతోనే హక్కులను సాధించుకోవచ్చని, సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని వారు అన్నారు. త్రీటౌన్ ప్రాంతంలోని హమాలీ కార్మికులు, ఇతర కార్మికులు పెద్ద సంఖ్యలో చలో జైల్‌భరో కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బండారు యాకయ్య, మల్లికార్జున్, పిరయ్య, మల్లిఖార్జున, రామకృష్ణ హమాలీ యూనియన్ నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# నేడు ఇల్లందులో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలకు భారీ ఏర్పాట్లుచేసిన ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య.

**అక్షర కలం ఇల్లందు ప్రతినిధి :-**

నేడు (9- 8 -2026 ఆదివారం) ఇల్లందులో జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా శాసనసభ్యులు ఎమ్మెల్యే కోరం కనకయ్య నాయకత్వంలో పట్టణంలో భారీ ప్రదర్శన బహిరంగ సభ ఉంటుందని శనివారం ఎమ్మెల్యే సింగరేణి క్యాంపులో జరిగిన సమావేశంలో ఆదివాసి సీనియర్ నాయకులు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 9వ తేదీ ఉదయం 8.00 గంటలకు గోవింద్ సెంటర్ వద్ద నుండి ఆదివాసీ వాయిద్య కళాకారులు, సాంప్రదాయ కొమ్ము డ్యాన్స్ బృందాల ప్రదర్శనలతో భారీ ర్యాలీ ప్రారంభం కానున్నదని, ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే వివిధ కళారూపాలతో ర్యాలీ పట్టణ ప్రధాన వీధుల గుండా కొనసాగనుందన్నారు. అనంతరం ఉదయం 9.00 గంటలకు ఇల్లందు కొత్త బస్టాండ్‌లో ఉన్న ఆదివాసీల ఆరాధ్య నాయకుడు కొమరం భీం విగ్రహానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య పూలమాలలు వేసి ఘన నివాళులర్పిస్తారని, అక్కడి నుండి ర్యాలీ సింగరేణి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్న అనంతరం భారీ బహిరంగ సభ నిర్వహించబడుతుందన్నారు. ఈ సభలో ఆదివాసీల అభివృద్ధి, హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాలు, విద్యా మరియు ఉపాధి అవకాశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, ఆదివాసీ సంఘాల నాయకులు, యువత, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను విజయవంతం చేయడానికి ఆదివాసీ సోదరులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.




ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఆదివాసి సీనియర్ నాయకులు మూతి కృష్ణ, ఆర్.ఎం. కిరణ్, పూణెం సురేందర్, పాయం స్వాతి, పాయం కృష్ణ ప్రసాద్, కల్తీ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

# మాకుప్రత్యామ్నాయం కల్పించండి.

**అక్షర కలం / భద్రాచలం**

భద్రాచలం సీతారామచంద్ర స్వామి వారి విస్తా కాంప్లెక్స్ లోని 40 ఫ్యాన్సీ డ బొమ్మల షాపుల వ్యాపారులకు ప్రత్యామ్నాయస్థలంకల్పించవలసిందిగా వినతి పత్రం.గౌరవనీయులైన, భద్రాద్రి దేవస్థానం ఈవో,జిల్లాకలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెంగౌరవ ఎమ్మెల్యే, భద్రాచలంవారికి,విస్తా కాంప్లెక్స్ వ్యాపారస్తులసంఘం.భద్రాచలం.మేము భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి విస్తా కాంప్లెక్స్ నుండి గోదావరికి వెళ్లే మార్గంలో గత 10 నుండి 15 సంవత్సరాలుగా ఫ్యాన్సీ, బొమ్మలు మరియు ఇతర చిన్న వ్యాపారాలునిర్వహిస్తున్నాము.మొత్తం సుమారు 40 షాపులుఉన్నాయి. వీటిపై 100 నుండి 120 కుటుంబాలు ప్రత్యక్షంగాఆధారపడిజీవనంసాగిస్తున్నాము .విషయంఏమిటంటే.రామాలయ అభివృద్ధి పనుల్లో భాగంగా ఈ నెల 16వ తారీకు లోపుషాపులుఖాళీ చేయాలని దేవస్థానం వారు నోటీసు ఇచ్చారు.అభివృద్ధికిమేముఎప్పుడూ వ్యతిరేకం కాదు అయ్యా.రామయ్య గుడికి ఎక్కువమందిభక్తులురావాలి, ఆలయం ఇంకా బాగుపడాలి అనేదే మాకోరిక.అభివృద్ధికిమేముఎప్పుడూ ఆటంకం కాదు.కానీ ఒకేసారి ఖాళీ చేయమంటేమాపరిస్థితిఅగమ్యగోచరంగా ఉంది.గోదావరి పుష్కరాల సమయంలో మేము హెవీ డిపాజిట్ కట్టి లీజుకు తీసుకున్నాము.చాలా మందిబ్యాంకుఫైనాన్స్,చీటీలు,అప్పులుచేసిసరుకుతెచ్చుకున్నాము.ఒక్కసారిగాషాపులుతీసేస్తే120కుటుంబాలురోడ్డునపడేపరిస్థితి.అందుకేమాకు ప్రత్యామ్నాయస్థలంచూపించినతర్వాతేమేము ఖాళీచేస్తామనిదేవస్థానం అధికారులకు విన్నవించాము. ఎమ్మెల్యే,మరియు అధికారుల దృష్టికి ఒకవిషయంతీసుకొస్తున్నామ ు.రాముల వారి ఆలయానికి నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన సత్రం ప్రసాదం పథకం పక్కనచాలాఖాళీస్థలం ఉంది.



ఆస్థలంలోమాకుప్రత ్యామ్నాయషాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఇస్తే,మేము వెంటనే ఖాళీచేసిసహకరిస్తాము.అది భక్తులకుకూడాఅనుకూలంగాఉంటుంది.కాబట్టి మా 120 కుటుంబాల ఉపాధినిదృష్టిలోఉంచుకొని,అభివృద్ధి జరుగుతూనే మా ఉపాధి కూడా నిలబడేలా చర్యలు తీసుకోవాలని, పై తెలిపిన ప్రత్యామ్నాయ స్థలంలో మాకు వసతి కల్పించాలని మనవి చేసుకుంటున్నాము.అభివృద్ధిజరగాలి - ఉపాధి నిలబడాలి అనేదే మా నినాదం.ఇందుకుతగినచర్యలుతీసుకొనిమమ్మల్నిఆదుకోవాలనికోరుకుంటున్నాము.విస్తాకాంప్లెక్స్. వ్యాపారస్తుల సంఘం భద్రాచలం

# వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు ప్రణాళిక అమలు చేయాలి.---- జిల్లా కలెక్టర్ అంకిత్

**అక్షర కలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి :-**

వరి సాగును తగ్గించి తక్కువ నీటి వినియోగించే ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణం పెంచాలని, తాగునీటికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. చెరువులు, ప్రాజెక్టుల నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. వరి సాగును తగ్గించి తక్కువ నీటి వినియోగంతో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా రైతులను ప్రోత్సహించాలని, తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ జిల్లాలో ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతుల ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన నిర్వహించిన నీటిపారుదల సలహా సంసిద్ధత సమావేశంలో జిల్లాలోని నీటి లభ్యత, తాగునీటి అవసరాలు, చెరువులు, మధ్యతరహా ప్రాజెక్టుల నీటి నిల్వలు, వర్షపాతం పరిస్థితి, పంటల సాగు విస్తీర్ణం, ప్రత్యామ్నాయ పంటల సాగు తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా



సమీక్షించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని, రాబోయే రోజుల్లో నీటి అవసరాలను ముందుగానే అంచనా వేసి అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. తాగునీటి అవసరాలకు భంగం కలగకుండా సాగునీటి వినియోగంలో శాఖల మధ్య సమన్వయం పాటించాలని స్పష్టం చేశారు.

వర్షా బావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వరి సాగును తగ్గించి తక్కువ నీటి వినియోగం అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఆయిల్‌పామ్, కూరగాయలు, పెసర, మినుము, కంది వంటి పంటలను ప్రాంతానుసారం సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల సాగు, తక్కువ నీటి వినియోగం, పంటల వైవిధ్యీకరణ, వర్షాభావ పరిస్థితుల్లో పంటలను కాపాడుకునే విధానాలపై వ్యవసాయ శాఖ అధికారులు రైతుల ఇంటింటికీ వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామంలోని ప్రతి రైతుకు ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రాధాన్యతను వివరించి, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు సాంకేతిక సూచనలు అందించాలని తెలిపారు. చెరువులు,బోర్‌వెల్స్‌పై అధికంగా ఆధారపడి వరి సాగు చేయడాన్ని నిరుత్సాహపరుస్తూ, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. రైజ్డ్ బెడ్ విధానం, నీటి సంరక్షణ, వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, నేలలో తేమను సంరక్షించే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. చెరువులు, ప్రాజెక్టుల నీటి నిల్వలు, వర్షపాతం, తాగునీటి లభ్యత, పంటల సాగు పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. తాగునీటికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, జిల్లాలో ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని, నీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ, అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని, ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచి పంట నష్టాల ప్రమాదాన్ని తగ్గించాలని కలెక్టర్ సూచించారు. తాగునీటి అవసరాలకు ప్రథమ ప్రాధాన్యత, సాగునీటి వినియోగంలో సమర్థత, పంటల వైవిధ్యీకరణతో రైతుల ఆదాయ పరిరక్షణ లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశం లో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, ఇరిగేషన్ ఎస్సీ శ్రీనివాసరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కిషోర్, సిపిఓ సునీత, మిషన్ భగీరథ ఈఈ లు నళిని, తిరుమలేష్, నీటిపారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ఆధ్వర్యంలో మెట్‌పల్లి పాత బస్టాండ్ వద్ద మహా ధర్నా

**బీడీ కార్మికులు, వృద్ధులకు పింఛన్లు ఇవ్వాలి**

**మెట్‌పల్లి ఆగస్టు 8 (అక్షర కలం)**

పట్టణంలో ఇటీవల మంజూరైన చేయూత పింఛన్లలో అర్హులైన బీడీ కార్మికులు, వృద్ధులకు పింఛన్లు మంజూరు చేయకపోవడాన్ని నిరసిస్తూ బీజేపీ మెట్‌పల్లి పట్టణ శాఖ ఆధ్వర్యంలో శనివారం పాత బస్టాండ్ చౌరస్తా వద్ద మహా ధర్నా నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొనికెల నవీన్



ఆధ్వర్యంలో బీడీ కార్మికులు, మహిళా కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని బీడీలు చుడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దొనికెల నవీన్ మాట్లాడుతూ మెట్‌పల్లి పట్టణం, పరిసర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో బీడీ కార్మికులు ఏళ్లుగా ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. బీడీ కార్మికుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆధారపడి ఉన్నాయని, వృద్ధులు సైతం ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో బీడీ కార్మికులకు పింఛన్లు అందిస్తామని హామీ ఇచ్చి, ప్రస్తుతం అర్హులకు పింఛన్లు మంజూరు చేయకపోవడం అన్యాయమన్నారు. బీడీ కార్మికుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, అనంతరం వాటిని రద్దు చేయడం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అర్హులైన ప్రతి బీడీ కార్మికుడు, వృద్ధుడికి చేయూత పింఛన్ మంజూరు చేసేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదలు, వృద్ధులకు న్యాయం జరిగే వరకు అవసరమైన పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జంగుల అనిల్ గౌడ్, కలికోట శ్రీకాంత్, బత్తుల జగదీష్, నూనె క్రాంతి, బొడ్ల ఆనంద్, కౌన్సిలర్లు దొనికెల శిరీష, కోయల్కర్ స్రవంతి, బొడ్ల వసుధ, కుడుకారపు దివ్య, సీనియర్ నాయకులు మిట్టపల్లి కృష్ణమూర్తి, పాస్కంటి శ్రీనివాస్, సంకు ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ వద్దిరాజును సత్కరించిన ఆకుల కిరణ్

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :**



రాజ్యసభలో బీఆర్ఎస్ పక్ష నేతగా, పార్లమెంటరీ పార్టీ లీడర్ గా నియమితులైన వద్దిరాజు రవిచంద్రను శనివారం సాయంత్రం సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం కాజుపల్లి నాయకుడు ఆకుల కిరణ్ కుమార్ తెలంగాణ ఉద్యమకారులు గుండ్లపల్లి శేషగిరిరావుతో కలిసి శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# ఈ నెల 10న నాగార్జునసాగర్‌లో ‘వరుణ యాగం’

## రాష్ట్రం సుభిక్షంగా ఉండాలనే సీఎం ఆధ్వర్యంలో నిర్వహణ

## కలెక్టర్ చంద్రశేఖర్

## యాదగిరిగుట్ట దేవస్థానం ఆధ్వర్యంలో 108 మంది ఋత్వికులతో వేడుకగా యాగం

## కృష్ణా తీరంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**

ఎల్ నినో కారణంగా రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలన్నింటిలో చాలా తక్కువ నీరు ఉండడం, వర్షాలు లేకపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రజల ప్రయోజనార్థం ,ప్రజలు సుభిక్షంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఈ నెల 10న నాగార్జునసాగర్ సమీపంలోని కృష్ణా నది ఒడ్డున విజయ విహార్ లో వరుణ యాగం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రాక ఏర్పాట్ల విషయమై శనివారం ఆయన అధికారులతో కలిసి వరుణ యాగం నిర్వహించే యాగ శాల, ప్రవచన శాల,హెలిప్యాడ్, తదితర ప్రదేశాలను పర్యటించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో 108 మంది ఋత్వికులతో రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల అర్చకులు కలిసి ఈ నెల 10న ఉదయం 4 గంటలకు వరుణ యాగం చేపట్టనున్నారని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. కృష్ణా నది ఒడ్డున చేపడుతున్న ఈ యాగం వల్ల వానలు సమృద్ధిగా కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్న ఆకాంక్షతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు లేక రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా రైతాంగం అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ సంవత్సరం వర్షాలు రావడం చాలా ఆలస్యమైందని, అంతేకాక గోదావరి, కృష్ణ నదులలో నీరు చాలా తక్కువగా ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రైతుల సంక్షేమం కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో తలపెట్టిన వరుణ యాగం ఈనెల 10 న ఆధ్యాత్మిక కేంద్రంగా వెలిసిన నాగార్జునసాగర్ విజయ్ విహార్ కృష్ణ నది ఒడ్డున నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ యాగం ద్వారా దేవుడు కరుణ చూపించి వర్షాలు కురుస్తాయన్న నమ్మకం ఉందని, దీంతో జలాశయాలు, నదులు, చెరువులు నిండుకుండలా మారాలన్న ఆశతో ఈ యాగాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదివారమే మంత్రులు ఇతర ప్రముఖులు, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ,దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ వస్తున్నట్లు తెలిపారు. వరుణయాగాన్ని భక్తులు తిలకించే విధంగా ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ యాగంతో తప్పకుండా దేవుడు కరుణిస్తాడని, రైతులకు మంచి జరుగుతుందని ఆశించారు.అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో రాష్ట్ర ముఖ్యమంత్రి రాక ఏర్పాట్లపై సమీక్షించారు. ముఖ్యంగా యాగానికి అవసరమైన ఏర్పాట్లతో పాటు, శానిటేషన్, తాగునీరు, నిరంతరాయ విద్యుత్ సరఫరా, ఎల్ఈడి స్క్రీన్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, లైటింగ్,బందోబస్తు అన్నిటిని ఏర్పాటు చేయాలని ,ప్రతి అంశానికి ఒక అధికారిని ఇన్చార్జిగా నియమించాలని చెప్పారు. సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ, నల్గొండ అడిషనల్ ఎస్పి రమేష్, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, ముఖ్యమంత్రి భద్రత అధికారులు, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.



# పండుగ సాయన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**అక్షరకలం బీబీనగర్**



తెలంగాణ సాయుధ పోరాట వీరుడు పండుగ సాయన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీబీనగర్ ముదిరాజ్ సంఘం సభ్యులు పిలుపునిచ్చారు. పండుగ సాయన్న జయంతిని పురస్కరించుకుని బీబీనగర్ మండల కేంద్రంలో పోచంపల్లి రోడ్డు చౌరస్తాలో పండుగ సాయన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించుకొని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముదిరాజ్ కుల బాంధవుడైన పండుగ సాయన్న పేదల బంధువుగా నిలిచారని అన్నారు. దొరల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన పండుగ సాయన్న పోరాట పటిమ, ధైర్యసాహసాలు చిరస్మరణీయమని కొనియాడారు. నిరుపేదల హక్కుల కోసం ఆయన చేసిన త్యాగాలు నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు. పండుగ సాయన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రభుత్వం పట్టించుకోని పండుగ సాయన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసి పండుగ సాయన్న జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలి,


అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# ఉద్యమ పంథాలో ఉద్యోగ పెన్షనర్లు

అంతన్నారు ఇంతన్నారు, ఇప్పుడన్నారు అప్పుడన్నారు, నేడన్నారు రేపన్నారు. రెండున్నర సంవత్సరాలు మాత్రం రెప్పపాటులో గడిచిపోయాయి. అధికారంలోకి రాగానే పెండింగ్ డిఎలు విడుదల చేస్తాం. కానీ 30 నెలల తర్వాత కేవలం మూడు డిఎలు విడుదల చేయడానికి ముప్పుతిప్పలు పడ్డారు. ఆరు నెలల్లో కొత్త పిఆర్‌సి అమలు చేస్తాం ఇది కేవలం నినాదంగానే మిగిలింది. పిఆర్‌సి కమిటీ గడువును పొడిగిస్తూ కాలం గడుపుతున్నారు. 2023 జులై నుండి అమలు కావలసిన పిఆర్‌సికి మూడు ఏళ్లు విజయవంతంగా నిండాయి. ఇప్పటికి నివేదిక అందని ద్రాక్ష పండులాగానే ఉంది. ఇక దాని అమలు గురించి మాట్లాడుకోకపోవడమే మంచిది. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తాం, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తాం. ఈ వాగ్దానం ఊసే లేదు. ఇక పెన్షనర్ల బాధలు చెబితే భారతం అంత, రాస్తే రామాయణమంత. విరమణ చెంది రెండు సంవత్సరాలు గడిచినా రావలసిన బకాయిలు చేతికి అందకపోవడంతో వందకు పైగా గుండెలు ఆకస్మాత్తుగా ఆగిపోయాయి. ఎదురు చూసిన వారి కళ్ళు కాయలు కాసి పండ్లుగా మారగా చివరికి వారే రాలిపోయారు. వారి కుటుంబాలు ఛిద్రమైపోయాయి. వారి ఆశలు ఆవిరి కాగా, కలలు కల్లలు అయిపోయాయి. సంఘాల ఒత్తిడి ప్రాతినిధ్యాల అనంతరం నెమ్మదిగా జిపిఎఫ్ సొమ్ము, మెడికల్ బిల్లులు విడుదలైనాయి నెలకు రూ. 500 కోట్లు విడుదల చేస్తామన్నారు, తర్వాత 600 కోట్లు అన్నారు. కానీ అందులో సింహభాగం కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులే జరిగినట్లు సమాచారం. ఏప్రిల్ 2024లో మొదలైన పదవీ విరమణలు నెలకు 800 నుండి 1000 దాకా జరుగుతుండగా వారికి చెల్లించాల్సిన బకాయిలు గుట్టల్లాగా పేరుకుపోయాయి.

ఈ మధ్య ఉద్యోగ సంఘాల సమ్మె నోటీసు తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి 100 రోజుల్లో అంటే మూడు నెలల్లో 6000 కోట్లు అంటే నెలకు రెండు వేల కోట్లు విడుదల చేసి పెన్షనర్లకు గ్రాట్యుటీ, కమ్యూటేషన్ సొమ్ము చెల్లించుతామని ప్రకటించారు. ఇది కూడా ఇప్పటికీ కొంతమందికే అందినట్లు పెన్షనర్లు తమ అసంతృప్తిని వెళ్లబుచ్చుతున్నారు. నేటికీ ఇంకా ఆరు డిఎలు పెండింగ్ ఉండడంతో ప్రతి ఉద్యోగికి నెలకు సగటున పదివేల రూపాయల నష్టం వాటిల్లుతున్నట్లుగా గణాంకాలు తెలుపుతున్నాయి. ముఖ్యమంత్రి మరొక పిడుగు లాంటి వార్త ప్రకటించారు. పెండింగ్ డిఎలన్నీ పిఆర్‌సిలో కలిపి కొత్త స్కేల్స్‌తో కూడిన సిఫార్సులు రాబోతున్నాయని చెబితే ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేయడం జరిగింది. పాలాభిషేకాలు కూడా చేశారు. కానీ అది ఎలా సాధ్యమో ఎవరూ చెప్పలేకపోయారు. ఎంత మేరకు ప్రతి ఉద్యోగికి నష్టమో మాత్రం అందరూ గ్రహించారు. ఇది కేవలం ఉద్యోగ పెన్షనర్లను చాలా తెలివిగా మోసం చేయడమే తప్ప అందులో వారికి చేస్తున్న మేలు ఏమాత్రం లేదు. మొత్తం మీద పిఆర్‌సి ఎంతెంత దూరం.. ఇంకెంత దూరం అన్నట్లుగా ఉంది. ఇది గ్రహించిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు అక్కడక్కడ ఈ సంఘాలు మాకొద్దు అంటూ తమ నిరసనను, అసంతృప్తిని వ్యక్తపరచడం గమనార్హం. ఇది ఉద్యోగ సంఘాల మనుగడకు ప్రమాదకరం కాగా ప్రభుత్వాలకు చాలా కలిసి వచ్చే అంశం. పాలక వర్గాలు ఎప్పుడూ సంఘాలలో చీలికలే కోరుకుంటారనేది వాస్తవం. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న నగదురహిత చికిత్స ఎండమావిలాగా ఉంది. మొదటి జూన్ రెండవ తేదీన ప్రారంభించుతారని ఒక ప్రకటన వచ్చింది. అంతకుముందు అనేక కమిటీలు పలు అధ్యయనాలు, పర్యటనలు జరిగాయి. జూన్ 17న ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ పేరుతో ఒక సిఇఒ కొద్ది మంది ఉన్నతాధికారులు ఇంకా కొంతమంది ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కలిసి ఏర్పడింది. ఎంపికైన ఆసుపత్రులు వాటిలో సేవలందించే విభాగాలతో కూడిన ఒక జాబితా విడుదలైంది. అది చాలా అసమగ్రంగా ఉంది. నెట్వర్క్ ఆసుపత్రులతో ఒప్పందాలు లేకుండానే ఉత్తుత్తి ప్రకటనలు ఆర్భాటాలు జరిగాయి. అన్ని ఆసుపత్రులలో అన్ని జబ్బులకు చికిత్స కల్పించబడలేదు. ప్రమాదకరమైన క్యాన్సర్, గుండె జబ్బులు, పక్షవాతం, కిడ్నీ వ్యాధులు వంటి వాటికి ప్రత్యేక ఆసుపత్రి ఉండదు. మేజరుకు కానీ సాధారణ జబ్బులకు కూడా కొన్ని ఆసుపత్రులు ఎంపిక చేయబడలేదు. ఎంప్యానల్‌మెంట్ ఆ విధంగా జరిగితే ఉద్యోగ పెన్షనర్లకు సౌకర్యవంతంగా ఉంటుంది. ఏ విధమైన మార్గదర్శకాలు లేకుండానే జూలై 15న ఈ నగదు రహిత చికిత్స ప్రారంభం అవుతుందని తెలిసి ఇది జరిగేనా



అన్న అనుమానం కలిగింది. చివరకు అదే జరిగింది. అసలు విషయం తరువాత బయటపడింది. ఎంపికైన ఆసుపత్రుల యజమాన్యాలతో జబ్బుల చికిత్సకు ధరలు నిర్ధారణ కాకుండానే ఏదో హడావిడి జరిగింది. వారు రేట్ల పెంపు డిమాండ్ చేశారు. ఉద్యోగులు ప్రభుత్వానికి రెండు కళ్ళలాంటివారు. అవును ప్రభుత్వం మాత్రం తన దృష్టి ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల పై సారించదు. వారి సంక్షేమం గురించి గొప్పగా ఉపన్యాసాలు మాత్రమే ఇస్తుంది. ప్రతిసారి వారికి రిక్తహస్తాలే అందిస్తారు. కేవలం ఎన్నికలకు పనికివచ్చే ముడి సరుకుగా మిగిలిపోతున్నారు.

# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేటు పెట్టుబడిదారులకు మతోన్మాదాలకు వ్యతిరేకంగా..... - ఆగస్టు 10 జైలు భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయండి..... మెదక్ జిల్లా సిఐటీయూ జిల్లా కోశాధికారి కే నర్సమ్మ....

**కొల్చారం, ఆగస్టు08(అక్షర కలం):**

సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆటో ప్రచార యాత్ర సందర్భంగా కూల్చారం మండల కేంద్రం లో మాట్లాడుతూ సిఐటియూ జిల్లా కోశాదికారి కదారి నర్సమ్మ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మిక చట్టాలని రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేసింది. కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం దానివల్ల కార్మికులకు పనిగంటలు పెరిగి సంఘం పెట్టుకునే హక్కులు కోల్పోతూ పని భారం పెరుగుతూ వారి హక్కులన్నీ అరించే విధంగా దుర్మార్గంగా ఉన్నటువంటి ఈ నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి. పెరిగిన ధరలు కనుగుణంగా కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి. 2025 విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలి. విత్తన చట్టం రద్దు చేయాలి. ఈ చట్టాల వల్ల ప్రజలకు ఉచిత విద్యుత్తు దూరమవుతుందని అన్నారు. ప్రజలకు ఆహార వస్తువులు విపరీతమైన రేట్లు పెరుగుతూ ప్రజలందరికీ అధిక భారం పడుతుందని అన్నారు. ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని కల్పించాలి, రోజువారి వేతనం 600ఇవ్వాలి. కేంద్రంలో యూపీఏ కాంగ్రెస్ ప్రభుత్వం 2005లో ఉన్నప్పుడు వామపక్షాల పోరాట ఫలితంగా"మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారెంటీ చట్టం"అమలు చేయబడ్డది. పోరాడి సాధించుకున్న వందరోజుల పనిని ఈరోజు కేంద్రంలో ఉన్న యూనియన్ గవర్నమెంట్ ఆఫ్



ఇండియా బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరును తొలగించి దీని స్థానంలో"వికసిత్ భారత్ గ్రామ్, జీ"(వి బి జి,రామ్ జీ) మార్పు చేయడమే కాక, రాష్ట్రాల వాటా 10, శాతం నుండి,40 శాతం నిధులను భరించాలని రాష్ట్రాల మీద భారం రుద్దాలని, కేంద్ర ప్రభుత్వం ఇదే అదునుగా భావించి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ 100 రోజుల పనిని ఎత్తివేయాలని కుట్రలు చేస్తుంది. ఈ కుట్రలు తిప్పి కొట్టడానికి వ ఈ నెల ఆగస్టు 10, తేదీన సోమవారం రోజున జైల్ భరో కార్యక్రమానికి అన్ని రంగాల కార్మికులు హాజరై విజయవంతం చేయాలని మూడు సంఘాల తరపున పిలుపునివ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డీ మల్లేశం,ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శేఖర్ ,ప్రసాద్ పాల్గొన్నారు.

# తల్లి పాలతో శిశువుకు సంపూర్ణ ఆరోగ్య రక్షణ

## సిద్ధన్నపేటలో తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ.. సదస్సు

**అక్షర కలం సిద్దిపేట ఆగస్టు08:**

శిశువుల సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతో కీలకమని సిద్ధన్నపేట సర్పంచి సంగు పురేందర్ అన్నారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం సిద్ధన్నపేట గ్రామంలో శుక్రవారం తల్లి పాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి, తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. గర్భిణులు, బాలింతలు, గ్రామ మహిళలకు తల్లిపాల ప్రాముఖ్యత, శిశువుకు అందించాల్సిన పోషకాహారం, పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ అంశాలపై వివరించారు. బిడ్డ ఆరోగ్యవంతంగా ఎదగడానికి తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయని, కుటుంబ సభ్యులు కూడా బాలింతలకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. సమాజం భాగస్వామ్యంతోనే చైతన్యంశిశువుల ఆరోగ్య పరిరక్షణలో తల్లిపాల ప్రాధాన్యతపై ప్రతి కుటుంబంలో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగించి, శాస్త్రీయమైన ఆరోగ్య సమాచారాన్ని ప్రజలకు చేర వేయడంలో ఆరోగ్య, అంగన్వాడీ సిబ్బంది కీలక పాత్ర పోషించాలని తెలిపారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు అందించడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చని



పేర్కొన్నారు. తల్లిపాలు శిశువుకు మొదటి టీకా నవజాత శిశువుకు తల్లిపాలే అత్యుత్తమ ఆహారమని బహుళ ప్రయోజన ఆరోగ్యసహాయకులు(ఎంపీహెచ్ఏ) సరస్వతి చెప్పారు. శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన పోషకాలు తల్లి పాలలో సమృద్ధిగా ఉంటాయని వివరించారు. ముఖ్యంగా బిడ్డ పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు (కొలస్ట్రం) శిశువుకు ఎంతో ప్రయోజనకరమని చెప్పారు. వాటిని తప్పనిసరిగా అందించాలని చెప్పారు. తల్లిపాలు బిడ్డకు మొదటి టీకా వంటివని తెలిపారు. తల్లిపాలు శిశువుకు వ్యాధి నిరోధక శక్తిని పెంచడంతో పాటు, వివిధ రకాల ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పిస్తాయని పంచాయతీ కార్యదర్శి అనితా రెడ్డి తెలిపారు. తల్లిపాలు అందించడం వల్ల తల్లీ బిడ్డల మధ్య అనుబంధం మరింత బలపడుతుందని అన్నారు. తల్లికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. ర్యాలీతో అవగాహనతల్లి పాల ప్రాధాన్యతపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో ప్రజాప్రతినిధులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు. "తల్లిపాలే బిడ్డకు తొలి ఆహారం", "తల్లిపాలతో ఆరోగ్యవంతమైన బాల్యం" వంటి సందేశాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సంగు పురేందర్, ఉప సర్పంచి చిలుకల తిరుపతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అనితా రెడ్డి, వార్డు సభ్యులు రాజు, డాకూరి రాజిరెడ్డి, ఏఎన్ఎం సరస్వతి, అంగన్వాడీ కార్యకర్తలు కత్తుల భవాని, కాచగోని లావణ్య పాల్గొన్నారు. గ్రామస్థులు ఉడుతల దుర్గయ్య, తదితరులు కార్యక్రమంలో పాల్గొని తల్లి పాల ప్రాముఖ్యతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

**ఆరోగ్యవంతమైన తరానికి బలమైన పునాది**

బిడ్డ జీవితంలో తొలి దశ అత్యంత కీలకమైనదని, ఈ దశలో సరైన పోషకాహారం, తల్లిపాలు, ఆరోగ్య సంరక్షణ అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన తరాన్ని నిర్మించవచ్చని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. తల్లి పాలపై అవగాహనను కేవలం ఒకరోజు కార్యక్రమానికే పరిమితం చేయకుండా ప్రతి గ్రామంలో నిరంతరం కొనసాగించాలని కోరారు.

# జీఆర్ఎంబీ ఎజెండా నుంచి ఏడు ప్రాజెక్టుల రద్దు అంశాన్ని తొలగించకుండా పాల్గొంటే తెలంగాణ ప్రయోజనాలు తాకట్టు పెట్టడమే తెలంగాణ ప్రభుత్వం జీఆర్ఎంబీ సమావేశాన్ని బహిష్కరించాలి పోచబోయిన శ్రీహరి యాదవ్

**అక్షర కలం సిద్దిపేట ఆగష్టు 08:**

ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ లో జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, కొండం రవీందర్ రెడ్డి, మేడికాయల వెంకటేశం, కీసర పాపయ్య లతో కలిసి మాట్లాడుతూ తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగించే విధంగా గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశం ఎజెండాలో ఏడు ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతుల రద్దు అంశాలను చేర్చడంపై తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించాలని పోచబోయిన శ్రీహరి యాదవ్ డిమాండ్ చేశారు. గోదావరి నదీ చరిత్రలో ఇప్పటివరకు లేని విధంగా కొన్ని ప్రాజెక్టులకు సంబంధించిన ఇప్పటికే పొందిన అనుమతుల అంశాలను జీఆర్ఎంబీ సమావేశం ఎజెండాలో చేర్చడం ఆందోళనకరమని ఆశ్చర్యకరమని ఆయన అన్నారు. ఇది తెలంగాణ హక్కులను కాలరాయడమే నోటి కాడి బుక్కను ఎగ్గొట్టడమే నన్నారు.



తెలంగాణ రాష్ట్ర వాటా 968 టీఎంసీ ఈ అనుమతులు కేవలం నుంచి 500 టీఎంసీ లే నీటి వినియోగానికి సంబంధించిన ప్రాజెక్టులకు కూడా పూర్తిస్థాయి అనుమతులు తీసుకోవాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ, తెలంగాణకు సంబంధించిన పలు ప్రాజెక్టుల విషయంలో స్పష్టత లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇప్పటికే తెలంగాణకు ఉపయోగపడే ఏడు ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలు జీఆర్ఎంబీ ఎజెండాలోకి రావడంపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎందుకు మౌనం వహిస్తోందని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ప్రధాన ట్యాగ్ లైన్ నీళ్లు. సాగునీటి తాగునీటి అంశాల్లో ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని కోరారు. ఎత్తిపోతల పథకాలే తెలంగాణకు జీవనాడితెలంగాణలోని సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల ద్వారానే రాష్ట్రానికి నీటి భద్రత సాధ్యమవుతుందని శ్రీహరి యాదవ్ అన్నారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే ఇతర రాజకీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్నారనే భావన ప్రజల్లో కలగకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు. తెలంగాణ హక్కులు, నీటి వాటా విషయంలో ఎలాంటి రాజీకి తావివ్వకూడదన్నారు. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరయ్యే ముందు స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి జీఆర్ఎంబీ సమావేశం ఎజెండాలో ఉన్న తెలంగాణకు సంబంధించిన ఏడు ప్రాజెక్టుల రద్దు అంశాలను తొలగించిన తర్వాతనే తెలంగాణ ప్రభుత్వం సమావేశానికి హాజరు కావాలని పోచబోయిన శ్రీహరి యాదవ్ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న అంశాలను ఎజెండాలో ఉంచి సమావేశానికి హాజరు కావడం సరికాదు. ముందుగా ఏడు ప్రాజెక్టుల రద్దుకు సంబంధించిన అంశాలను ఎజెండా నుంచి తొలగించాలి. లేకపోతే జీఆర్ఎంబీ సమావేశాన్ని తెలంగాణ ప్రభుత్వం బహిష్కరించాలి అని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు పోచబోయిన శ్రీహరి యాదవ్ తో పాటు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, కొండం రవీందర్ రెడ్డి,మేడికాయల వెంకటేశం, కీసర పాపయ్య, రేగుల దేవయ్య, సతీష్ రామచ రమేష్ బెజ్జంకి బిక్షపతి మల్లేశం తదితరులు ఉన్నారు.

# దేశంలో మోడీని ఎవరు ప్రశ్నిస్తే వాళ్ళని దేశ్ ద్రోహులుగా ముద్రిస్తున్నారు

**గద్వాల్ టౌన్ అక్షర కలం:**

మోడీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేస్తూ సామాన్య ప్రజలపై భారాలు మోపుతోందని సీపీఐ జోగులాంబ గద్వాల జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు విమర్శించారు. శనివారం జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలో సీపీఐ ఆధ్వర్యంలో ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ పాదయాత్ర నిర్వహించారు. ఇటిక్యాల సర్కిల్ హైవే రోడ్డు నుంచి పొగాకు కంపెనీ మీదుగా జింకలపల్లి వరకు పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా బి. ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజల జీవనం భారంగా మారిందన్నారు. వెంటనే ధరలను నియంత్రించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్లకు అప్పగిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం మానుకోవాలని అన్నారు.




రైతులకు పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, యువతకు ఉద్యోగాలు కల్పించాలని, కార్మికుల హక్కులను పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధరల పెరుగుదలపై ప్రజలను చైతన్యపరుస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ఏఐటియుసి జిల్లా కార్యదర్శి జి రంగన్న హెచ్చరించారు. ఎవరు ప్రశ్నించినా, పోరాడిన, ఉద్యమించిన అందరినీ ద్రోహులుగా ముద్రించడం సిగ్గుచేటు అని, అలా చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# వెంకట్రావు మృతదేహానికి మాజీ మున్సిపల్ చైర్మన్ బి.యస్. కేశవ్ నివాళులు


**గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి**

గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డు వడ్లవీధికి చెందిన సుకూన్ కారి వెంకట్రావు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మున్సిపల్ చైర్మన్ బి.యస్. కేశవ్ వార్డు కౌన్సిలర్ కమ్మరి సునీత రాముతో కలిసి మృతుడి స్వగృహానికి వెళ్లారు. ఈ సందర్భంగా వెంకట్రావు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వెంకట్రావు మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, ఈ విషాద సమయంలో వారికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు గోపాల్, టి.ఎన్.ఆర్. జగదీష్, మోహన్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు చిత్తారి కిరణ్ తదితరులు పాల్గొని వెంకట్రావు పార్థివదేహానికి నివాళులు అర్పించారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

## ఆట



# ఆసియాలో బెస్ట్ టెస్ట్ కెప్టెన్ కోహ్లీ..

క్రికెట్‌లో టెస్టు ఫార్మాట్‌కు ఎంతో ప్రత్యేకత ఉంది. వన్డే, టీ20లతో పోలిస్తే టెస్టుల్లో మ్యాచులు గెలవడం భిన్నం. ఆట సాగే ఐదు రోజులు ఆధిపత్యం చలాయించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఒక్కోసారి ఒక సెషన్ ఆట గమనాన్నే మార్చేస్తుంది. అయితే కొందరు సారథులు మాత్రం.. జట్టుకు వరుసగా విజయాలు అందిస్తూ రికార్డులు క్రియేట్ చేశారు. వెస్టిండీస్‌తో రెండో టెస్టులో గెలవడం ద్వారా పాక్ కెప్టెన్ బాబర్ ఆజమ్.. తన జట్టును 8 వరుస ఓటముల తర్వాత విదేశీ గడ్డపై టెస్టు మ్యాచులో గెలిపించాడు. ఈ జాబితాను పరిశీలిస్తే, భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. విరాట్ కోహ్లీ నేతృత్వంలో టీమిండియా ఏకంగా 40 టెస్టు మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. దీంతో రన్ మెషిన్.. ఆసియాలోనే అత్యంత విజవంతమైన సారథిగా నిలిచాడు. ఈ లిస్ట్‌లో భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ 27 విజయాలతో రెండో స్థానంలో ఉన్నాడు. పాకిస్థాన్ మాజీ కెప్టెన్ మిస్బా-ఉల్-హక్ 26 విజయాలతో మూడో స్థానంలో నిలవగా, టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ 21 విజయాలతో నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాడు. ఆ తర్వాత శ్రీలంక దిగ్గజాలు సనత్ జయసూర్య (18), మహేల జయవర్ధనే (18) సంయుక్తంగా తదుపరి స్థానాల్లో ఉన్నారు.ఇక టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ సారథ్యంలో భారత్.. 12 టెస్టు మ్యాచులలో విజయం సాధించింది.









# వన్డే వరల్డ్ కప్ రేసులో భువీ, షమీ

టీమిండియా సీనియర్ పేసర్లు భువనేశ్వర్ కుమార్ , మహమ్మద్ షమీలు 2027 వన్డే ప్రపంచకప్ జట్టులో చోటు దక్కించుకుంటారా అనే విషయంపై జోరుగా చర్చ జరుగుతోంది. కొందరు వారికి ఆ సామర్థ్యం ఉందని పేర్కొంటున్నారు. మరికొందరేమో అది సాధ్యం కాదని పేర్కొంటున్నారు. తాజాగా ఇదే విషయంపై టీమిండియా మాజీ ఓపెనర్ ఆకాశ్ చోప్రా మాట్లాడాడు. వన్డే ప్రపంచకప్ ప్రణాళికల్లో భాగం కావాలంటే వీరిద్దరూ రంజీ ట్రోఫీ వంటి సుదీర్ఘ ఫార్మాట్లు ఆడటం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్‌లో ఆర్సీబీ విజయాలో భువీ కీలక పాత్ర పోషించినప్పటికీ, కేవలం టీ20లలో 4 ఓవర్లు బౌలింగ్ చేయడం ద్వారా వన్డే ప్రపంచకప్‌కు సిద్ధం కావడం సాధ్యపడదన్నాడు.భువనేశ్వర్ జనవరి 2024 నుంచి ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు, అలాగే డిసెంబర్ 2023 నుంచి లిస్ట్-ఎ మ్యాచ్‌లు ఆడలేదని చోప్రా గుర్తు చేశాడు. వన్డే క్రికెట్‌లో మ్యాచ్‌కు 10 ఓవర్లు బౌలింగ్ చేయడంతో పాటు 50 ఓవర్ల పాటు ఫీల్డింగ్ చేయాల్సి ఉంటుందని చెప్పాడు. అందుకు తగిన ఫిట్‌నెస్ సాధించాలంటే రంజీ మ్యాచ్‌లు ఆడటం తప్పనిసరి అని విశ్లేషించాడు. బీసీసీఐ సెలెక్టర్లు భువీని వరల్డ్ కప్ రేసులో ఉంచాలనుకుంటే, ఇప్పటి నుంచే అతడిని జట్టులోకి తీసుకుని వరుస సిరీస్‌లలో అవకాశం ఇవ్వాలని సూచించాడు. మరోవైపు, మహమ్మద్ షమీ పరిస్థితి భువీ కంటే కాస్త మెరుగ్గా ఉందని చోప్రా పేర్కొన్నాడు. షమీ ఇటీవలే రంజీ ట్రోఫీలో పాల్గొని 37 వికెట్లు పడగొట్టాడని, త్వరలో దులీప్ ట్రోఫీలో కూడా ఆడనున్నందున అతనికి ఫిట్‌నెస్ పరంగా మెరుగైన అవకాశం ఉందని చెప్పాడ. అయినప్పటికీ, ఐపీఎల్‌లో వ్యక్తిగత ప్రదర్శనల విషయానికి వస్తే షమీ కంటే భువనేశ్వర్ కుమారే కొంత ముందంజలో ఉన్నాడని ఆకాశ్ చోప్రా పేర్కొన్నాడు. రాబోయే వెస్టిండీస్ వన్డే సిరీస్ ద్వారా టీమిండియా మేనేజ్‌మెంట్ ఆలోచనలపై స్పష్టత వస్తుందని ఆకాశ్ చోప్రా అన్నాడు. సెలెక్టర్లు ఈ ఇద్దరిలో ఒకరిని మాత్రమే ఎంపిక చేసే అవకాశం ఉందని, అసలు ఇద్దరినీ తీసుకోకపోతే వారి కెరీర్ ముగిసినట్లేనని వివరించాడు. కాగా, భువనేశ్వర్ కుమార్ భారత్ తరఫున చివరిగా జనవరి 2022లో వన్డే ఆడగా, షమీ చివరిసారిగా గతేడాది జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో కనిపించాడు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక



## సినిమా
CINEMA




# నవంబర్ 6న రామాయణ విడుదల

నితీశ్ తివారీ దర్శకత్వంలో భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ'ను ప్రకటించినప్పుడే రెండు భాగాల విడుదల ఎప్పుడనేది చిత్రబృందం వెల్లడించింది. ఈ ఏడాది దీపావళి కానుకగా.. మొదటి భాగాన్ని, వచ్చే ఏడాది దీపావళికి రెండో పార్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ తెలిపారు. తాజాగా మొదటి భాగం అధికారిక విడుదల తేదీని చిత్ర నిర్మాణ సంస్థ ప్రకటించింది. నవంబర్ 6న రామాయణను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తెలుపుతూ పోస్ట్ పెట్టింది అదే రోజున రణ్‌బీర్ కుమార్తె రాహా పుట్టినరోజు కావడంతో ఈ తేదీ ఆయనకు మరింత ప్రత్యేకం కానుంది. ఇక ఈసినిమాలో మండోదరి పాత్రలో కాజల్ కనిపించనున్నారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో ఈ చిత్రం గురించి మాట్లాడారు. ఇది ఎంతో గొప్పగా రూపొందుతోందని.. ప్రపంచదేశాలకు మన సంస్కృతిని తెలియజేయడానికి రామాయణ సరైన కథ అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందే కథలను సృష్టించగల సామర్థ్యం భారతీయ సినిమాకు ఉందని చెప్పారు. రూ.4000కోట్లతో ఈ సినిమా రూపొందుతోంది. ఇందులో రాముడిగా రణ్‌బీర్ నటించగా.. సీతగా సాయిపల్లవి, రావణుడి పాత్రలో యశ్ కనిపించనున్నారు. ఇటీవల ట్రైలర్‌ను విడుదల చేయగా అది విజువల్ వండర్‌గా యూట్యూబ్ ట్రెండిగ్‌లో నిలిచింది.

# చకచకా రాకా మూవీ షూటింగ్

## మెటర్నిటీ బ్రేక్‌లో దీపికా పదుకొణె

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ప్రస్తుతం మాతృత్వాన్ని ఆస్వాదిస్తూ కుటుంబంతో సమయం గడుపుతున్నారు. అయితే ఆమె మెటర్నిటీ బ్రేక్ కారణంగా అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'రాకా' షూటింగ్‌కు ఆటంకం ఏర్పడుతుందనే ప్రచారం జరుగుతున్న వేళ, చిత్రబృందం అందుకు పూర్తి భిన్నంగా ముందుకు సాగుతున్నట్లు సమాచారం. సినీ వర్గాల సమాచారం ప్రకారం, దీపికా మెటర్నటీ బ్రేక్‌ను ముందుగానే దృష్టిలో పెట్టుకుని చిత్రబృందం షూటింగ్ షెడ్యూల్‌ను ఎంతో కచ్చితంగా ఎ÷-లాన్ చేసింది. ఆమె అందుబాటులో ఉన్న సమయంలోనే ఎక్కువ భాగం సన్నివేశాలను పూర్తి చేయడంతో ప్రస్తుతం షూటింగ్ ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతోంది. దీపికా విరామంలో ఉన్న రోజుల్లో ఇతర ప్రధాన నటీనటులతో చిత్రీకరణ నిర్వహిస్తూ ఒక్క రోజు కూడా వృథా కాకుండా మేకర్స్ జాగ్రత్తలు తీసుకున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం దీపికా పదుకొణెకు సంబంధించిన షూటింగ్ దాదాపు పూర్తయినట్లు సమాచారం. చిన్న సన్నివేశాలు మాత్రమే ఉండగా, వాటిని తర్వాతి దశలో చిత్రీకరించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆమె వ్యక్తిగత జీవితానికి, సినిమా నిర్మాణానికి మధ్య ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మేకర్స్ పక్కా ప్లానింగ్ చేసినట్లు తెలుస్తోంది. 'రాకా' సినిమాలో దీపికా పదుకొణె పాత్ర కథకు అత్యంత కీలకమని సమాచారం. ఆమె పాత్ర చుట్టూనే కథలో ప్రధాన మలుపులు తిరుగుతాయని టాక్ వినిపిస్తోంది. అందుకే షూటింగ్ ప్రారంభ దశలోనే ఆమె సన్నివేశాలకు ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేసినట్లు తెలుస్తోంది.భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'రాకా' ఒకటిగా

నిలిచింది. భారీ తారాగణం, హై టెక్నికల్ స్టాండర్డ్స్, భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. షూటింగ్ అనుకున్న షెడ్యూల్ ప్రకారమే కొనసాగుతుండటంతో, సినిమా విడుదల కూడా నిర్ణయించిన సమయానికే జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# తండ్రి నాగబాబుతో వరుణ్ తేజ్ బరి

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదలకు ముందు చిత్రబృందం జోరుగా ప్రమోషన్స్ నిర్వహిస్తుండగా, తాజాగా ఓ ఇంటర్వ్యూలో వరుణ్ తేజ్ తన తదుపరి సినిమా గురించి ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. తొలిసారిగా తన తండ్రి నాగబాబుతో కలిసి ఒకే సినిమాలో నటించబోతున్నట్లు ప్రకటించారు. నాగబాబు నటుడిగా చిరంజీవి, పవన్ కళ్యాణ్, రామ్ చరణ్, సాయిధరమ్ తేజ్ సహా మెగా కుటుంబానికి చెందిన పలువురు హీరోలతో కలిసి నటించారు. అయితే ఆశ్చర్యకరంగా తన కుమారుడు వరుణ్ తేజ్‌తో మాత్రం ఇప్పటివరకు పూర్తి స్థాయి సినిమాలో స్క్రీన్ షేర్ చేసుకోలేదు.






అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# విద్యారంగ సమస్యల పరిష్కారంలో పాలక ప్రభుత్వాలు విఫలం --ఎస్ఎఫ్ఐ




**అక్షరకలం నాంపల్లి**

విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పాలక ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ విమర్శించారు. శనివారం నాంపల్లి మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ విద్య మరింత కుంటుపడిందన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో విద్యా రంగ సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలు మాటలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్ల కోసం విద్యార్థులను వేధిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. డా. బి అర్ అంబేద్కర్, భగత్ సింగ్, చేగువేరా ఆశయాలతో విద్యా హక్కుల సాధన కోసం బలమైన పోరాటాలు నిర్వహిస్తామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు కుర్ర సైదా నాయక్, కోరే రమేష్, బుడిగ వెంకటేష్, ముస్కు రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు మారుపాక కిరణ్, మూడవత్ జగన్ నాయక్, మండల నాయకులు గణేష్, వర్షిత్, స్పందన, పూజ, భవాని తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్స్‌తో కార్మికుల హక్కులకు ముప్పు



**అక్షర కలం ; చిట్యాల**

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్ అన్నారు. శనివారం చిట్యాల మండల కేంద్రంలోని మేకల లింగయ్య స్మారక భవనంలో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిట్ట నగేష్ మాట్లాడుతూ.. కార్మికుల రోజువారీ పని దినాన్ని 8 గంటల నుంచి 12 గంటలకు పెంచేలా లేబర్ కోడ్స్‌లో నిబంధనలు ఉన్నాయని, ఇవి యాజమాన్యాలకు అనుకూలంగా, కార్మికులకు ఇబ్బందికరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు నిర్వహిస్తున్న పోరాటాల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ నెల 10న నిర్వహించనున్న జైల్‌భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కత్తుల లింగస్వామి మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రూపురేఖలను మార్చడంతో పాటు నిధుల కేటాయింపులో కోత విధించారని ఆరోపించారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే ఉపాధి హామీ పథకాన్ని మరింత బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చేతివృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఐతరాజు నర్సింహా, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కోనేటి రాములు, ఐతరాజు నర్సింహా, సీఐటీయూ మండల నాయకులు పాల లక్ష్మయ్య, జనపాల జ్యోతి, పాలమాకుల అర్జున్, కల్లూరి కుమారస్వామి, పెర్కా శంకరయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# నాగార్జున సాగర్ కింద వరి వద్దు

## --సాగు నీటి ప్రాజక్టుల జిల్లా సిఈ శ్రీనివాస రెడ్డి

**అక్షరకలం నల్గొండ**

ప్రస్తుతం నాగార్జున సాగర్ లో ఉన్న నీరు తాగునీటికే సరిపోతుందని అందువల్ల ప్రాజక్ట్ కింది ఆయకట్టు రైతులు వరి వేసుకోవద్దని సాగు నీటి ప్రాజక్టుల జిల్లా సిఈ శ్రీనివాస రెడ్డి తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో ఆయన జిల్లాలోని వివిధ ప్రాజక్టులలో ఉన్న సాగునీటి లభ్యత ,వినియోగం,తదితర అంశాలను సమావేశానికి హాజరైన రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డికి,సమావేశానికి హాజరైన ఇతర ప్రజాప్రతినిధులు,అధికారులకు వివరించారు.ప్రస్తుతం ప్రాజక్టులలో ఉన్న నీరు తాగు నీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ఆ తర్వాతే పంటల గురించి ఆలోచించడం జరుగుతుందన్నారు. వర్షాలు లేకపోవడం,రాబోయే రోజుల్లో పై నుండి కూడా నీరు వచ్చే అవకాశం లేనందున వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో రైతులు ఎట్టి పరిస్థితులలో వరి వేసుకోవద్దని కోరారు. ప్రాజక్టులు,బోర్ల కింద వరి వేసుకుంటే ఏ దశలో నైనా పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని,వచ్చే 6 నెలలు ఇదే పరిస్థితులు ఉండవచ్చని, బోర్లలో కూడా నీరు తగ్గవచ్చని, వరికి అనుకూల పరిస్థితులు లేవని, జిల్లాలో రైతులు ఎట్టి పరిస్థితులలో వరి వేసుకోవద్దని పునరుద్ఘాటించారు.



ఈ సీజన్ లో వరి కాకుండా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని, కంప సాగర్ వ్యవసాయ శాస్త్ర వేత్తలు సూచించారు. కంది, మిల్లెట్స్,వంటి పంటలు వేసుకోవాలని, ఆపత్కాల పంటలైన కంది, పెసర, మినుము,బొబ్బర్లు,ఉలవలు, ఆముదం,పొద్దు తిరుగుడు,నువ్వులు, వేసుకోవాలని సూచించారు. ఆగస్టు 15 వరకే ప్రత్యామ్నాయ పంటలు వేసుకునే అవకాశం ఉందని,ఈ వారంలోనే ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని, ఇందుకు అవసరమైన విత్తనాలు,ఎరువులు ప్రభుత్వం ఇస్తుందని జిల్లా కలెక్టర్ బి.చంద్ర శేఖర్ రైతులకు విజ్ఞప్తి చేశారు.

# రోస్టర్ విధానాన్ని మార్చకపోతే 'ప్రభుత్వాన్ని' మారుస్తాం !

## తడి గుడ్డతో మాలల గొంతు కోస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

## ప్రభుత్వాన్ని కూల్చే సత్తా మాలలకు ఉంది

## జాతీయ మాలమహానాడు హెచ్చరిక

## ఆగస్టు 31న 'ఛలో సెక్రటేరియట్'కు పిలుపు

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న అశాస్త్రీయ ఎస్సీ వర్గీకరణ, ఏకపక్ష ఎస్సీ రోస్టర్ విధానానికి నిరసనగా ఈ నెల ఆగస్టు 31న 'ఛలో సెక్రటేరియట్' (సెక్రటేరియట్ ముట్టడి) కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జాతీయ మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో ప్రభుత్వం మాల, దాని అనుబంధ కులాల విద్యా, ఉద్యోగ అవకాశాలకు గండి కొడుతోందని, ఈ నిరంకుశ విధానాలను తిప్పికొట్టేందుకు మాలలు, ప్రజాస్వామ్యవాదులు కదలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ ధర్నా చౌక్ వద్ద జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో 'మాలల మహాధర్నా' కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ స్టీరింగ్ కమిటీ సభ్యులు గోలి సైదులు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాకు జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

**మాలల భవిష్యత్తును నాశనం చేస్తున్నారు..**

ధర్నాను ఉద్దేశించి పిల్లి సుధాకర్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తడిగుడ్డతో మాలల గొంతు కోస్తున్నారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎస్సీ వర్గీకరణ తదుపరి అమలు చేస్తున్న రోస్టర్ విధానం కారణంగా ఎస్సీ గ్రూప్-3 పరిధిలోకి వచ్చే మాల, దాని అనుబంధ 25 కులాల విద్యార్థులు, నిరుద్యోగులు విద్యా, ఉద్యోగ, ప్రమోషన్ల అవకాశాలలో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన 14 ఉద్యోగ నోటిఫికేషన్లలో ఎస్సీ గ్రూప్-3లోని మాల విద్యార్థులకు ఒక్క పోస్టు కూడా దక్కకపోవడమే ఇందుకు సజీవ సాక్ష్యమని పేర్కొన్నారు. మాలల భవిష్యత్తును అందని ద్రాక్షలా మార్చిన






ఈ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం కాదని, స్పష్టంగా మాల వ్యతిరేక ప్రభుత్వమని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎస్సీ రోస్టర్ విధానాన్ని సవరించకపోతే మాలల ఆగ్రహానికి గురికాక తప్పదని, ప్రభుత్వాన్ని కూల్చే సత్తా మాలలకు ఉందని తీవ్రంగా హెచ్చరించారు.

**ఉభయ రాష్ట్రాల మాలలు ఏకం కావాలి**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాల జేఏసీ కన్వీనర్ సర్వయ్య మాట్లాడుతూ... వర్గీకరణ నిబంధనల వల్ల మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకోవాలంటే రోస్టర్ విధానంలో 20 లోపు కనీసం 3 పాయింట్లను మాలలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం మాలలంతా ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.?ఆంధ్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు మాట్లాడుతూ... నాటి చంద్రబాబు నాయుడి శిష్యుడిగా రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ పేరుతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ భావజాలానికి తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగబద్ధమైన హక్కులను భంగపరుస్తున్న ఈ విధానాలను ఎండగట్టడానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉభయ రాష్ట్రాల మాలలు ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహాధర్నా కార్యక్రమంలో మాలమహానాడు నల్గొండ జిల్లా అధ్యక్షుడు బోగరి విజయ్, నల్లవెల్లి సంజీవ, మాల జేఏసీ కన్వీనర్ నల్లల కనకరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మేడి అంజయ్య, వెన్న రాజు, బుట్టి సత్యనారాయణ, సర్వే సార్, కళాకారుడు గోరేటి రమేష్, మాల యువత నాయకులు కట్ట వినయ్, చింతమల్ల విజయ్ కుమార్ పాల్గొని మద్దతు తెలిపారు. అలాగే ఆంధ్ర మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లం రవి, ఏపీ రెల్లి సంఘం నాయకులు రాగుల రాఘవులు, గుబ్బల ఆదినారాయణ, మణెమ్మ, రావుల శ్రీనివాస్, గాజుల భాస్కర్ తదితర ముఖ్య నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కరెంట్ అధికారులకు 'కోమటిరెడ్డి' షాక్.!

## బినామీలతో పనులా?

## విద్యుత్తు అధికారుల బాధ్యతారాహిత్యంపై భగ్గుమన్న మంత్రి కోమటిరెడ్డి

## రైతులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

## తక్షణమే వైఖరి మార్చుకోవాలని ఆదేశం!

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**

ఉమ్మడి నల్గొండ జిల్లా లోని విద్యుత్ శాఖ అధికారుల తీరు, వారి పనితీరుపై రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నెలకు లక్షలాది రూపాయల జీతాలు పొందుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా వ్యవహరించడంలో విఫలమవుతున్నారని మండిపడ్డారు. రైతాంగానికి విద్యుత్ సరఫరా విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా సహించే ప్రసక్తి లేదని, నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం నల్లగొండ కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన జిల్లా సాగునీటి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**బినామీలతో విధులు....**

విద్యుత్ శాఖలోని హెల్పర్లు, లైన్‌మెన్ల బినామి పని పై




మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయి సిబ్బంది విధులకు గైర్హాజరవుతూ, నెలకు రూ. 5,000 నుండి రూ. 10,000 ఆశచూపి తమ స్థానంలో అరకొర పరిజ్ఞానం ఉన్న వేరే ప్రైవేట్ వ్యక్తులను (బినామీలను) పనిలో పెట్టుకుంటున్నారని మంత్రి బహిరంగంగానే మండిపడ్డారు. ఇటువంటి నిబంధనా విరుద్ధమైన చర్యల వల్ల ప్రమాదాలు జరగడమే కాకుండా, విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని అసహనం వ్యక్తం చేశారు. ఈ రకమైన దందాలు ఇకపై సాగనిచ్చేది లేదని, ఇటువంటి అక్రమాలకు పాల్పడే సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేయాలని ఆదేశించారు.

**---క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందే...**

సహాయ ఇంజనీర్లు (ఏఈ ), డివిజనల్ ఇంజనీర్లు (డిఈ ) కేవలం కార్యాలయాలకే పరిమితం కావడంపై మంత్రి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులు స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. నిరంతరం ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉంటూ బాధ్యతలు నిర్వర్తించాలని, ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా తక్షణమే స్పందించేలా ప్రతి సెక్షన్ ఆఫీసులో యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచాలని సూచించారు.

**ఏ చిన్న పొరపాటైనా సహించం..**

రైతాంగానికి పంట పొలాలకు విద్యుత్ సరఫరా చేసే క్రమంలో ఎటువంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా వ్యవసాయ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, కండక్టర్లు (వైర్లు), ఇన్సులేటర్లు, ఇతర పరికరాల కొరత లేకుండా స్టాక్ సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. సామగ్రి కొరతను సాకుగా చూపి విద్యుత్ పునరుద్ధరణను ఆలస్యం చేస్తే సంబంధిత ఉన్నతాధికారులనే బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. రైతుల పట్ల ఏ చిన్న పొరపాటు జరిగినా, నిర్లక్ష్యం వహించినా ఉద్యోగాల నుంచే తొలగించడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. శాఖాపరమైన లోపాలను తక్షణమే సరిదిద్దుకుని, రైతులకు, సాధారణ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును నిరంతరం అందించేలా అధికారులు తమ వైఖరిని మార్చుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

# రవీంద్ర హై స్కూల్ లో ఘనంగా బోనాల ఉత్సవం

**అక్షర కలం సిద్దిపేట ఆగస్టు 08:**

స్థానిక రవీంద్ర ఇంగ్లీష్ మీడియా హై స్కూల్ లో శనివారం రోజు బోనాల పండుగను చాలా ఘనంగ జరుపుకున్నామని పాఠశాల ప్రిన్సిపల్ ఇప్పలపల్లి హరికిషన్ తెలిపారు. పిల్లలు సంస్కృతి సంప్రదాయ పద్ధతిలో దుస్తులు ధరించి పాఠశాలకు వచ్చారు విద్యార్థులు అమ్మ వారి వేషం ధరించి శివాశసత్తుల పూనకాలతో బోనాలు నెత్తిన పెట్టుకొని దీకొండ మైసమ్మ





ఆలయం వద్ద వెళ్లి గుడిలో బోనం, నైవేద్యం సమర్పించి పాఠశాలకు తిరిగి వచ్చారు.ఆ తర్వాత జరిగిన కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ బోనాలు తెలంగాణ సంస్కృతి లో ఒక భాగమని అందరూ ఆ అమ్మవారి దయతో ఆరోగ్యాలతో ఉండాలని, విద్యార్థులు మన పండుగలను, సంస్కృతి సంప్రదాయాలను పాటించి బావి తరాలకు తెలియ చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు హేమలత,కృష్ణవేణి,కవిత, శ్వేత,నర్సింలు, షాహెద్,రమ్య, రేవతి పాల్గొన్నారు.

అక్షర కలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# ఫుట్‌పాత్‌పై 'ముక్క' అమ్మితే మూతపడాల్సిందే

**రోడ్డు పక్కన మటన్, చేపల విక్రయాలకు నో**

**రహదారులు, ప్రజా ప్రదేశాల్లో అమ్మకాలు జరిపితే సీజింగ్**

**అనుమతి పొందిన ప్రాంగణాల్లోనే వ్యాపారాలు నిర్వహించుకోవాలి**

**వ్యర్థాల విసిరివేతతో పారిశుధ్య లోపం, పెరిగిన ప్రజారోగ్య సమస్యలు**

**తెలంగాణ మున్సిపాలిటీల చట్టం ప్రకారం కఠిన చర్యలు**

**కమిషనర్ వంశీకృష్ణ హెచ్చరిక**

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**

నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఫుట్‌పాత్‌లు, ప్రధాన రహదారులు, ప్రజా ప్రదేశాలను ఆక్రమించి అనధికారికంగా మటన్, చేపల విక్రయాలు జరిపితే ఇకపై సహించేది లేదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బి. వంశీకృష్ణ ఒక ప్రకటన లో స్పష్టం చేశారు. నగరం లో ప్రజా సౌకర్యార్థం నిర్మించిన నడక మార్గాలను (ఫుట్‌పాత్‌లను) వ్యాపార స్థలాలుగా మార్చుకోవడం వల్ల సామాన్య ప్రజల రాకపోకలకు తీవ్ర విఘాతం కలగడమే కాకుండా, నగరం లో పారిశుధ్య లోపం, తీవ్రమైన ప్రజారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

**రోడ్లపై వ్యర్థాలు.. నివాసితుల తీవ్ర ఇబ్బందులు...**

ముఖ్యంగా ఆదివారాలు, పండుగ రోజుల్లో నగరం లోని వివిధ ప్రధాన కూడళ్లు, రోడ్ల పక్కన ఉన్న ఫుట్‌పాత్‌లపైనే తాత్కాలిక మటన్, చేపల దుకాణాలు వెలుస్తున్నాయని కమిషనర్ తెలిపారు. విక్రయాల అనంతరం మిగిలిన మాంసం, చేపల వ్యర్థాలను, మురుగును కొందరు వ్యాపారులు బాధ్యతారాహిత్యంగా రోడ్లపై, తెరచి ఉన్న మురుగు కాలువల్లో (డ్రైన్లలో) పడేస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో తీవ్ర దుర్వాసన వెదజల్లడంతో పాటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందంటూ నగర నివాసితులు, బాటసారుల నుంచి మున్సిపల్ కార్యాలయానికి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయని వెల్లడించారు. ప్రజల ఆరోగ్యం, పారిశుధ్య పరిరక్షణ దృష్ట్యా ఈ ఆక్రమణల నిరోధానికి కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

**అనుమతి ఉంటేనే విక్రయాలు...**

ఇకపై వ్యాపారులు విధిగా మున్సిపల్ నిబంధనల ప్రకారం మున్సిపాలిటీ నుంచి తగిన అనుమతి లేదా లైసెన్స్ పొందిన సొంత లేదా అద్దె దుకాణ ప్రాంగణాల్లో మాత్రమే మటన్, చేపల వ్యాపారాలు నిర్వహించుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో, రోడ్ల పక్కన



పందిళ్లు లేదా బల్లలు వేసి అమ్మకాలు జరిపితే చట్టరీత్యా నేరంగా పరిగణిస్తామని హెచ్చరించారు.

**చట్టప్రకారం కఠిన చర్యలు..**

తెలంగాణ మున్సిపాలిటీల చట్టం-2019 లోని పలు సెక్షన్ల ప్రకారం మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక తనిఖీలు చేపడతారని కమిషనర్ తెలిపారు. చట్టంలోని సెక్షన్ 146(3) (ప్రజా స్థలాల ఆక్రమణల తొలగింపు), అలాగే అనధికారిక జంతు వధ, మాంసం కోతకు సంబంధించిన సెక్షన్ 152 నిబంధనలను కఠినంగా అమలు చేస్తామన్నారు. నిబంధనలు ధిక్కరించి రోడ్లు, ఫుట్‌పాత్‌లపై అమ్మకాలు సాగిస్తే,?వ్యాపారాన్ని తక్షణమే నిలిపివేయడం జరుగుతుందని ఆక్రమిత ప్రాంతాల్లో జరిపే వ్యాపారాలను వెంటనే అడ్డుకుని నిలిపివేస్తామని స్పష్టం చేశారు.

**-ఆక్రమణల తొలగింపు...**

ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన బల్లలు, షెడ్లు, తాత్కాలిక నిర్మాణాలను తొలగిస్తారు. ?దుకాణాల సీజింగ్, సామగ్రి స్వాధీనం. నిబంధనలు అతిక్రమించిన వారి మాంసం, చేపల నిల్వలతో పాటు వ్యాపార సామగ్రిని స్వాధీనం చేసుకుని, ప్రాంగణాలను సీజ్ చేస్తారు. భవిష్యత్తులో వారికి ఎలాంటి మున్సిపల్ లైసెన్సులు ఇవ్వకుండా చర్యలు తీసుకుంటారు.

**సహకరించాలని విజ్ఞప్తి...**

నల్లగొండ నగరాని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచడంలో ప్రతీ ఒక్కరి పాత్ర కీలకమని కమిషనర్ వంశీకృష్ణ పేర్కొన్నారు. ప్రజారోగ్యానికి, పారిశుధ్య నిర్వహణకు భంగం వాటిల్లకుండా వ్యాపారులందరూ మున్సిపల్ యంత్రాంగానికి సహకరించి, చట్టబద్ధమైన ప్రాంగణాల్లోనే తమ వ్యాపారాలను కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రోస్టర్ పాయింట్లను సవరించాలి

**నలుమాల నవీన్ - జాతీయ మాల మహానాడు జిల్లా యూత్ ఉపాధ్యక్షులు**

**అక్షర కలం సిద్దిపేట ఆగస్టు 08:**

మాలల రాజ్యాంగబద్ధ హక్కులను కాలరాస్తూ ప్రభుత్వం చేసిన రోస్టర్ పాయింట్ల కేటాయింపును తక్షణమే సవరించాలని జాతీయ మాల మహానాడు సిద్దిపేట జిల్లా యూత్ ఉపాధ్యక్షులు నలుమాల నవీన్ డిమాండ్ చేశారు. నంగునూరు మండలం నర్మేట గ్రామంలో మాట్లాడుతూ మాలలకు విద్యా, ఉద్యోగాల్లో న్యాయం జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మాల కార్పొరేషను ఏర్పాటు చేసి, మాల సామాజిక వర్గ అభివృద్ధి కోసం రూ, 2 కోట్లు కేటాయించాలని చేవెళ్ల డిక్లరేషన్ లో దళితుల కోసం ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే సాక్షిగా ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు.



# నీటి సంక్షోభంలో దక్షిణ తెలంగాణ

**వరి వదిలి ఆరుతడి పడితేనే రైతులకు మనుగడ**

**నల్గొండ జిల్లా సాగునీటి మండలి సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి స్పష్టీకరణ**

**డెడ్ స్టోరేజ్‌లో నాగార్జునసాగర్, సెప్టెంబర్ వరకు సూపర్ ఎల్ నినో ప్రభావం**

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**

ఎల్ నినో కారణంగా ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీరు తాగునీటికే సరిపోతుందని, అంతేకాక పైనుండి నీరు వచ్చే అవకాశం కూడా లేనందున రైతులు ఎట్టి పరిస్థితులలో వరి వేయకుండా ఆరు తడి పంటలు వేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు.ఒకవేళ నాగార్జునసాగర్ నిండినప్పటికీ చెరువులు నింపే పరిస్థితి లేదని, ఇప్పటికే బోర్లలో కూడా గ్రౌండ్ వాటర్ తగ్గిపోతున్నందు కష్ట కాలంలో అధికారులు ప్రజా ప్రతినిధులు రైతులకు అండగా నిలబడి ఆరుతడి పంటలు వేసుకునేలా చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. శనివారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు డెడ్ స్టోరేజ్ లో ఉందని, శ్రీశైలం నుండి నీరు వచ్చినప్పటికి పంటలకు సాగునీరు ఇచ్చే పరిస్థితి లేదని, ఉన్న నీరు జూన్ 2027 వరకు తాగునీటికే సరిపోతుందని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు .ఏ ఎం ఆర్ పి కూడా సగమే నిండిందని, గతంలో ఎప్పుడు ఇలాంటి పరిస్థితి లేదని, రాబోయే రోజుల్లో సూపర్ ఎల్ నినో కారణంగా దక్షిణ తెలంగాణలో పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొందని, అందువల్ల అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులు ఆరు తడి పంటలు వేసుకునేలా కష్టపడి పనిచేయాలని, ఇలాంటి కరువు పరిస్థితుల్లో రైతులకు అందరూ అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో పంట మార్పిడి లో భాగంగా 33 వేల ఎకరాలలో వరికి వదులు ఆరుతడి పంటలు వేయడం జరిగిందని, అయితే దీన్ని లక్షన్నర ఎకరాల లక్ష్యంగా తీసుకుని రైతులతో ఆరు తడి పంటలు వేయించాలన్నారు. జిల్లాలో 9 వేల ట్రాన్స్ఫార్మర్ల పై ఉన్న ఓవర్ లోడ్ ను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి అవసరమైన విద్యుత్ సామాగ్రిని తెప్పిస్తామన్నారు. కరువు వచ్చినప్పటికి నల్గొండ జిల్లాకు శాశ్వతంగా సాగునీరు అందించే ఎస్ఎల్బీసీ సొరంగం పనులు ఆగస్టు 2028 నాటికి పూర్తి చేస్తామని, పనులు కొనసాగుతున్నాయని, ఎఎం ఆర్పీ, ఎస్ఎల్బీసీ, బ్రాహ్మణ వెల్లేముల ద్వారా జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. ఎస్ఎల్బీసీ కోసం ఎంతైనా ఖర్చు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారని,







కరువు వచ్చినా సరే శ్రీశైలం డెడ్ స్టోరేజ్ లో ఉన్నప్పటికీ ఎస్ఎల్బీసీ నుండి సాగునీరు అందించవచ్చన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కష్ట కాలంలో రైతులకు అండగా ఉండాలని, ప్రజలకు ధైర్యం చెప్పాలని, ఆరుతడి పంటలు వేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇకపై జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశాలను నిరంతరం నిర్వహించాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల కింద రైతులు రెండు పంటలు వరి వేస్తున్నారని,దీనివల్ల భవిష్యత్తులో భూములు సారం కోల్పోయి ఎందుకు పనికిరాకుండా పోతాయని, విపరీతంగా ఎరువులు వాడడం, నిరంతరం వరి సాగు చేయటం వల్ల భవిష్యత్ లో ఎలాంటి పంటలు వేసుకోలేని పరిస్థితి వస్తుందన్న విషయాన్ని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇందులో భాగంగా కూరగాయల పంటలు, ఉద్యాన పంటలు పండించాలని, ఆర్గానిక్ వ్యవసాయం చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని, జిల్లాకు 5 వేల యూనిట్ల స్ప్రింక్లర్లు కావాలని అధికారులు కోరగా తక్షణమే వాటిని మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

**పంట మార్పిడి తప్పనిసరి...**

ఎం ఎల్ సి శంకర్ నాయక్ మాట్లాడుతూ ఎల్ నినో వల్ల రాబోయే రోజుల్లో సాగునీటికి మరింత ఇబ్బంది ఏర్పడే ప్రమాదం ఉందని, అందువల్ల పంట మార్పిడి పై రైతుల వద్దకు వెళ్లి చెప్పాల్సిన అవసరం ఉందని, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పని చేసి రైతులను చైతన్యం చేయాలని, ఈ సంవత్సరం వర్షాలు తక్కువ ఉన్నందున పంట మార్పిడి కింద మెట్ట పంటలు వేసుకునే విధంగా చైతన్యం చేయాలన్నారు.

**సెప్టెంబర్ లో కూడా ప్రభావం...**

జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎల్ నినో వల్ల వర్షాలు లేనందున ప్రాజెక్టుల్లో కూడా సరైనంత నీరు లేదని, రానున్న రోజుల్లో పై నుండి సాగునీరు వచ్చే అవకాశాలు లేవని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని రాబోయే రోజుల్లో రైతులు వేసుకోబోయే పంటలు, తాగునీరు, ఇతర సౌకర్యాలపై చర్చించి ప్రణాళిక రూపొందించేందుకు జిల్లా సాగునీటి సలహా మండల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ లో కూడా సూపర్ ఎల్ నినో ప్రభావం ఉంటుందని ఉత్తర తెలంగాణకు మాత్రమే అక్కడక్కడ వర్షాలు వచ్చే అవకాశం ఉందని, దక్షిణ తెలంగాకు వర్షాలు లేవన్న వాతావరణ శాఖ సూచనలను దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉందని, రైతులు పంటల మార్పిడిలో భాగంగా ఆరుతడి పంటలు వేసుకోవాలని, ఆగస్టు 15 వరకు మాత్రమే ఆరుతడి పంటలు వేసుకునేందుకు అవకాశం ఉన్నందున వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి రైతులను చైతన్యం చేయాలని కోరారు. మున్సిపాలిటీలలో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ ను ప్రోత్సహించాలని కలెక్టర్ అన్నారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ శేఖర్ రెడ్డి, తదితరులు మాట్లాడారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, హాలియా, నిడమనూరు పిఏ సి ఎస్ అధ్యక్షులు, నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్,చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్, తదితరులు హాజరయ్యారుకాగా ప్రాజెక్టులు, గ్రౌండ్ వాటర్, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, విద్యుత్ అధికారులు డిఆర్డిఓ ప్రస్తుతం సాగునీటి పరిస్థితి, పంటలు, రాబోయే రోజుల్లో చేపట్టవలసిన కార్యాచరణ పై సమావేశానికి వివరించారు.

# తల్లి తండ్రుల మృతితో అనాధలైన పిల్లలు....

**అమ్మ నాన్న లేరు బతికేదెలా.............**

**ఎవరు మాకు మాకు దిక్కు.........**

**నూతనకల్ ఆగస్టు 8 (అక్షర కలం)**

అసలే పేద కుటుంబం. కూలీ నాలీ చేసుకుంటే తప్ప డొక్కాడని దుస్థితి. ఉండేందుకు సరైన ఇల్లు కూడా లేని దయనీయ పరిస్థితి. అయితే విధికి కన్ను కుట్టిందో ఏమో కానీ ఆ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది. అనారోగ్యంతో ఐదు సంవత్సరాల కింద తల్లి, లివర్ ఇన్ఫెక్షన్ గుండె సంబంధిత వ్యాధుల వలన ఇటువలె తండ్రి చనిపోవడంతో ఇద్దరు ఆడపిల్లలు అనాథలుగా మారారు. సహృదయులు స్పందించి ఆదుకుంటే పిల్లల భవిష్యత్ బాగుపడుతుందని బంధువులు, గ్రామస్థులు కోరుతున్నారు. వివరాలకెళ్ళితే సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రానికి చెందిన గుండ్ల లింగయ్య (40) గుండ్ల సరిత (35) దంపతులకు లిఖిత (15)నికిత (16)ఇద్దరు కుమార్తెలు ప్రస్తుతం ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నారు కుటుంబ ఆర్థిక పరిస్థితుల వలన చదువును మధ్యలో ఆపివేసి నానమ్మకు ఆసరాగా నిలిచిన అనాధ పిల్లలు భార్య చనిపోవడంతో అన్నీ తానై : మొదటగా భార్య చనిపోవడంతో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మూడు సంవత్సరాల కిందట భార్య అనారోగ్యంతో చనిపోవడంతో. కుటుంబానికి అండగా నిలిచి ఇద్దరు కుమార్తెలను వృద్ధురాలైన తన తల్లిని పోషించడంతో ఆ భారం అంతా తండ్రి పై పడింది. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొచ్చాడు. కూలీ చేస్తే వచ్చే డబ్బులతో కుటుంబం పూట గడవడం కూడా కష్టంగా మారింది. ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన తండ్రి : తల్లి చనిపోయిన తర్వాత





కూలీ పనులు చేసుకుంటూ పిల్లల ఆలనా పాలనా చూస్తున్న తండ్రి కూడా అనారోగ్యానికి గురై మూడు సంవత్సరాల క్రితం మరణించడంతో ఇద్దరు ఆడపిల్లలు పిల్లలు అనాథలుగా మారిపోయారు. తల్లిదండ్రులు ఇద్దరూ దూరం కావడం, సొంత ఇల్లు లేకపోవటం అంతా చిన్న పిల్లలు కావడంతో ఆ పిల్లల భవిష్యత్, పోషణ ప్రశ్నార్థకంగా మారిపోయింది... నానమ్మ దిక్కు... ఆ ఇద్దరు ఆడపిల్లలు చిన్న వయసులో ఉండగానే కొడుకు కోడలు అనారోగ్యం వలన మరణించడంతో గుండ్ల



ఐలమ్మ 70 కూలి పనులు చేసుకుంటూ ఆ ఇద్దరు మనుమరాలని అన్ని తానై వారిని చదువుంచుకుంటూ పెంచి పోషిస్తుంది విధి ఆడిన నాటకంలో అన్నీ కోలిపోయిన ఆ పిల్లలకు మళ్లీ ఆ కష్టంలోకే నెట్టివేసింది ఇటీవల నానమ్మ కాలుకు తీవ్ర గాయం కావడంతో ఇరుగుపొరుగు వారి దగ్గర లక్ష రూపాయలు అప్పు చేసి ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పిచ్చి బాగు చేశారు ఆ అప్పు తీర్చుటకై చదువు మధ్యలోనే ఆపివేసి కూలీనాలు చేసుకుంటూ నానమ్మకు ఆసరాగా నిలిచారు కనీసం నివసిస్తున్న ఇల్లు కూడా సరిగ్గా లేక ఇల్లు వర్షాకాలానికి కురుస్తుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ప్రస్తుతం నానమ్మ మంచానికే పరిమితం కావడంతో మరింత ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది.... అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోలేదు తల్లి తండ్రి మరణించిన తర్వాత అప్పట్లో ఉన్న కలెక్టర్ అనాధలైన ఆ ఇద్దరు పిల్లలకు అన్ని తానై ప్రభుత్వం తరపున అన్ని విధాల అదుకుంటామని భరోసా కల్పిస్తామన్నారు కానీ ఎలాంటి సహాయాలు అందలేదు స్థానిక నాయకుల దగ్గరికి వెళ్లిన తర్వాత వారు కూడా ఇల్లు కట్టిస్తామని ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు కానీ అది కూడా నెరవేరలేదు ఇప్పుడు బిక్కుబిక్కుమంటూ రోజులు గడుపుతున్నారు ఇప్పటికైనా ఆ అనాధ పిల్లలకు ఆసరాగా నిలిచి ఆదుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు

# వరి సాగుకు బదులు ఆరుతడి పంటలు సాగు చేయాలి ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా ఉండే అవకాశం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్





**గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి**

ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో కాలువలకు నీటి విడుదలపై స్పష్టత లేనందున నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు. కందులు, మిర్చి, మొక్కజొన్న, పెసలు, మినుములు, కూరగాయలు వంటి పంటలతో మంచి ఆదాయం పొందవచ్చన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న విత్తనాలు, పందిరి కూరగాయల సాగు, ఆయిల్‌పామ్ సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తాగునీటికి మొదటి ప్రాధాన్యతనిస్తూ జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు, కుంటలను నీటితో నింపుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుతో పాటు అంతర పంటల ద్వారా కూడా అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు.

# ఫ్లైఓవర్ పనులు వేగవంతం చేయాలి

### నాణ్యత, భద్రతలో రాజీ వద్దు..

### నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

### బాలానగర్‌లో ఎన్ హెచ్ ఎ ఐ పనులను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్ నగర్. బాలానగర్, ఆగస్టు 8 (అక్షర కలం):**

బాలానగర్‌లో కొనసాగుతున్న నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ( ఎన్ హెచ్ ఎ ఐ ) ఆధ్వర్యంలోని ఫ్లైఓవర్, సర్వీస్ రోడ్ల నిర్మాణ పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శనివారం తనిఖీ చేశారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనులతో పాటు అంబేద్కర్ విగ్రహానికి సంబంధించిన పనుల పురోగతిని పరిశీలించారు. నిర్మాణ ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన.. ఇప్పటివరకు పూర్తయిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న పనుల వివరాలను ఎన్ హెచ్ ఏ ఐ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.



ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. నిర్ణీత నాణ్యతా ప్రమాణాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకుండా పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫ్లైఓవర్, సర్వీస్ రోడ్ల నిర్మాణం పూర్తయితే బాలానగర్‌లో ట్రాఫిక్ సమస్యలకు గణనీయంగా పరిష్కారం లభించే అవకాశం ఉన్నందున పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

**భద్రతకు అధిక ప్రాధాన్యం**

నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో వాహనదారులు, పాదచారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని, అవసరమైన చోట్ల హెచ్చరిక బోర్డులు, భద్రతా ఏర్పాట్లు, ఇతర రక్షణ చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు.

**శాఖల మధ్య సమన్వయం తప్పనిసరి**

ఫ్లైఓవర్, సర్వీస్ రోడ్ల నిర్మాణంతో సంబంధం ఉన్న అన్ని శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని మధుసూదన్ నాయక్ సూచించారు. పనుల సందర్భంగా ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు, ఆమోదించబడిన సాంకేతిక ప్రమాణాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. నాణ్యత.. భద్రత.. వేగం అనే మూడు అంశాలకు ప్రాధాన్యమిస్తూ నిర్మాణ పనులను ముందుకు తీసుకెళ్లాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు.

# బహుజన నాయకుడు పండుగ సాయన్న విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ :



**(అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు,08)**

నారాయణపేట (జిల్లా కోటకొండ): మత్స్యకార సంఘం గ్రామ అధ్యక్షులు ఎదురు ఇంటి శ్రీనివాసుల ఆధ్వర్యంలో నేడు పెద్ద చెరువు వద్ద బహుజన నాయకుడు పండుగ సాయన్న విగ్రహ ప్రతిష్ఠాపన ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులు పండుగ సాయన్న గురించిన వివరాలు తెలియజేశారు. వారు చెప్పారు --- పండుగ సాయన్న భారత స్వాతంత్ర్యోద్యమ కాలానికి (1900 స??లో) చెందిన సమాంతర చరిత్రలో ముఖ్య స్థానంలో ఉన్నవాడు. సాయన్న 1860 నుండి 1900 వరకు జీవించి, చారిత్రకంగా సుమారు 35--38 ఏళ్ల వయసిలో హత్యకు గురయ్యాడు. ఆయన నిరంకుశ నిజాం పాలనతో, అధికాశవల్లులతో, ధనాధిపతులతో ఎచ్చరిపడుతూ సాధారణ ప్రజల యోగా ప్రయోజనాల కోసం పోరాటం చేశారు. బాధార్థుల నుంచి అత్యాచారంగా తీసుకునేవారి సంపదలను దోచి పేదలకు పంచి వారికి ఆదర్శమయ్యే విధంగా వ్యవహరించాడు --- అందువల్ల ప్రజలలో ఆయనను తెలంగాణ రాబిన్‌హుడ్‌గా గుర్తించారు.ముఖ్యంగా అన్నారు: పండుగ సాయన్న విశేష జీవితం ప్రజలకు స్ఫూర్తిదాయకం కావడంతో అతని విగ్రహాలు ప్రతి కథా ఊరులో ఉండాలని కోరారు. సూచనగా, సాయన్న బహుజన చైతన్యానికి నిరూపకుడని, తాను స్థాపించదలచిన స్వీయ పాలనతో ప్రజాప్రతినిధ్య భావనకు ప్రేరణ ఇచ్చినవాడు ఇదన్నారు.

# నిరుపేద కుటుంబానికి వంగ రాజేశ్వర్ రెడ్డి అండ

**అక్షర కలం సిద్దిపేట ఆగష్టు 08:**

నంగునూరు మండల కేంద్రానికి చెందిన బొజ్జ గోపి అకాల మరణం చెందడం బాధాకరం. ఈ విషయం వంగ రాజేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. వారి కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందించారు.ఈకార్యక్రమంలోసిద్దన్నపేట గ్రామ సర్పంచ్ సంగపురేందర్,పప్పు రాజిరెడ్డి,గోవిందారం రవి, పవన్ సంపత్ తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి బియ్యాన్ని అందజేశారు.




# రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై జైల్‌భరో

### ఆగస్టు 10న మహబూబ్‌నగర్‌లో నిర్వహించే కార్యక్రమాన్ని

### జయప్రదం చేయాలి

### రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుండుమల్ల నర్సింలు, ఏ. లక్ష్మయ్య పిలుపు

**మహమ్మదాబాద్. ఆగస్టు 8 అక్షర కలం :**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న జైల్‌భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుండుమల్ల నర్సింలు, ఏ. లక్ష్మయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను మహమ్మదాబాద్ మండల కేంద్రంతో పాటు జూలపల్లి గ్రామంలో శనివారం ఆవిష్కరించి ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించడంతో పాటు కూలీలకు రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే ఈ పథకాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కూలీల హక్కులను కాపాడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.




**రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే చట్టాలు వద్దు**

రైతులకు నష్టం కలిగించే విధంగా నూతన విద్యుత్ చట్టం, విత్తన సవరణ చట్టాలను తీసుకురావడం సరికాదని నాయకులు అన్నారు. ఈ చట్టాల ప్రభావం రైతులకే పరిమితం కాకుండా వ్యవసాయ ఉత్పత్తులు, వినియోగదారులపై కూడా పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తన విధానాలను మార్చుకోవాలని డిమాండ్ చేశారు.

**నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి**

కార్మికుల హక్కులకు భంగం కలిగించేలా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్మికులకు రక్షణ కల్పించే చట్టాలను బలోపేతం చేయాల్సింది పోయి, వారి హక్కులను హరించే విధానాలను అమలు చేయడం సరికాదన్నారు.

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న మహబూబ్‌నగర్‌లో నిర్వహించే జైల్‌భరో కార్యక్రమానికి రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో జూలపల్లి గ్రామ సర్పంచి గుండుమల్ల పద్మ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం. కురుమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. రాములు, తిరుమలగిరి మాజీ సర్పంచి బాలకృష్ణయ్య, యువజన సంఘం నాయకులు రాజు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాల పెంపునకు ‘మహబూబ్‌నగర్ ఫస్ట్’

### 100 పాఠశాలల్లో 100 మంది విద్యా వాలంటీర్లు.. మూడు రోజుల

### పాటు ప్రత్యేక శిక్షణ

### విద్యార్థుల అభ్యాస సామర్థ్యాల మెరుగుదలే లక్ష్యం.. సొంత నిధులతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వినూత్న కార్యక్రమం

**మహబూబ్‌నగర్, ఆగస్టు 8. అక్షర కలం :**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచి, పేద, గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తన సొంత నిధులతో విద్యారంగ బలోపేతానికి చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ‘మహబూబ్‌నగర్ ఫస్ట్’ ఆధ్వర్యంలో విద్యా వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ ప్రారంభమైంది.

గత విద్యా సంవత్సరంలో నియోజకవర్గంలోని 35 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా విద్యా వాలంటీర్ల వ్యవస్థను అమలు చేశారు. ఈ కార్యక్రమంతో విద్యార్థుల హాజరు శాతం పెరగడంతో పాటు అభ్యాస సామర్థ్యాలు మెరుగుపడటం, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వంటి సానుకూల ఫలితాలు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. దీంతో ఈ విద్యా సంవత్సరంలో కార్యక్రమాన్ని మరింత విస్తరించి నియోజకవర్గంలోని 100 ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నారు.

**పరీక్ష.. ఇంటర్వ్యూ.. 100 మంది ఎంపిక**

విద్యా వాలంటీర్ల ఎంపికలో పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ విద్యావంతులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ప్రత్యేక ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహించి అర్హత సాధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.



ఈ ప్రక్రియ ద్వారా 100 మంది విద్యా వాలంటీర్లను ఎంపిక చేశారు.

ఎంపికైన వారికి పాఠశాలల్లో విద్యార్థులను సమర్థంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు మూడు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆగస్టు 8, 9, 10 తేదీల్లో మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రంలో ఈ శిక్షణ కొనసాగనుంది.

**బోధనపై పట్టు.. విద్యార్థుల మానసిక స్థితిపై అవగాహన**

నిష్ణాతులైన ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఆధ్వర్యంలో వాలంటీర్లకు వివిధ అంశాలపై విస్తృత శిక్షణ అందిస్తున్నారు. సమర్థవంతమైన బోధనా పద్ధతులు, విద్యార్థుల మానసిక స్థితిని అర్థం చేసుకోవడం, సబ్జెక్టులపై పట్టు పెంపొందించడం, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం, డిజిటల్ లెర్నింగ్ విధానాలను వినియోగించడం తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.

**ఉత్సాహంగా పాల్గొన్న వాలంటీర్లు**

మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. వందేమాతరం ఫౌండేషన్ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో తొలిరోజు శిక్షణ తరగతులు సజావుగా జరిగాయి. ఎంపికైన విద్యా వాలంటీర్లు ఎంతో ఉత్సాహంగా శిక్షణలో పాల్గొని, పాఠశాలల్లో తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన నైపుణ్యాలను నేర్చుకుంటున్నారు.

**తొలిరోజు శిక్షణ ఇచ్చిన బృందం**

తొలిరోజు శిక్షణలో రజిత (రా+ు), హిమాబిందు (రా+ు), సురేష్ (రా+ు), ముస్తాక్ (రాూ మ్యాథ్స్), శ్రీనయ్య (రాూ సోషల్), శ్రీకాంత్ (రాూ సోషల్), సుష్మిత (రాూ సైన్స్), వెంకటయ్య (రాూ సోషల్), శ్రీనివాస్ (సైకాలజిస్ట్), ఫస్సియొద్దిన్ (మ్యాథ్స్) తదితరులు పాల్గొని శిక్షణ అందించారు.

**రాష్ట్రానికే ఆదర్శంగా..**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను పెంచడంతో పాటు, ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ చూపేలా రూపొందించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని విద్యావేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఈ వాలంటీర్ల వ్యవస్థ కీలకంగా మారుతుందని పేర్కొంటున్నారు. 100 ప్రభుత్వ పాఠశాలలు.. 100 మంది విద్యా వాలంటీర్లు.. లక్షలాది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసే లక్ష్యంతో సాగుతున్న ఈ కార్యక్రమం మహబూబ్‌నగర్ నియోజకవర్గ విద్యారంగంలో కొత్త మార్పులకు నాంది పలకడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# రాయి కొట్టడమే మా జీవనాధారం.. దానినీ అడ్డుకుంటే మా బతుకులు ఎలా...?

### - వడ్డెరల ఉపాధికి అనుమతులు ఇవ్వాలి.....

### - మెదక్ జిల్లా అధ్యక్షుడు దండుగుల దుర్గా సాయిలు.....

**కొల్చారం, ఆగస్టు08( అక్షర కలం):**

మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతంచెట్టిపల్లి చౌరస్తాలోని హనుమమ్మ ఫంక్షన్ హాల్‌లో శనివారం వడ్డెర ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మెదక్ జిల్లాలోని వివిధ మండలాల వడ్డెర సంఘం అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొని వడ్డెరల సమస్యలు, జీవనోపాధి, ఉపాధి అవకాశాలపై చర్చించారు.ఈ సందర్భంగా మెదక్ జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు దండుగుల దుర్గా సాయిలు మాట్లాడుతూ వడ్డెరల జీవనం రాళ్లతో ముడిపడి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ తాతల కాలం నుంచి తండ్రుల వరకు, ప్రస్తుతం తమ కుటుంబాలు కూడా రాళ్లు కొట్టి జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. అయితే ప్రస్తుతం రాయి కొట్టే వృత్తికి అడ్డంకులు ఏర్పడటంతో వడ్డెర కుటుంబాలు ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.మెదక్ జిల్లాలోని అనేక వడ్డెర కుటుంబాలకు కనీసం గుంట భూమి కూడా లేదని, చాలామందికి సొంత ఇళ్లు లేకపోవడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. “మా బతుకు రాయిపైనే ఆధారపడి ఉంది. రాయి కొట్టడమే మా జీవనోపాధి. ఆ వృత్తిని కూడా అడ్డుకుంటే మా కుటుంబాలను ఎలా పోషించుకోవాలి?” అని ప్రశ్నించారు.గత రెండేళ్లుగా ప్రతి మండలంలో అటవీశాఖ అధికారులు రాళ్లు కొట్టే తమ సంప్రదాయ వృత్తిని అడ్డుకుంటున్నారని దుర్గా సాయిలు తెలిపారు. ఉపాధి కోల్పోవడంతో అనేక వడ్డెర కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. గత ప్రభుత్వాల సమయంలో కూడా తమ సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.ప్రస్తుత ప్రభుత్వం వడ్డెరలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ చైర్మన్‌గా జరుపటి జైపాల్‌ను, తెలంగాణ రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌గా గుంజ రేణుకను నియమించడం పట్ల వడ్డెర సమాజం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

**అడవుల్లోని బండలపై రాయి కొట్టేందుకు అనుమతులు ఇవ్వాలి**

తెలంగాణ ముఖ్యమంత్రి తమ వడ్డెరల సమస్యలను ప్రత్యేకంగా పరిగణించి జీవనోపాధి కోసం అడవుల్లో ఉన్న అనుమతించదగిన బండలపై రాయి కొట్టుకునేందుకు చట్టబద్ధమైన అనుమతులు కల్పించాలని దుర్గా సాయిలు విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణ నిబంధనలను పాటిస్తూ, అటవీశాఖ సంబంధిత అధికారుల పర్యవేక్షణలో వడ్డెరలకు ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక విధానం రూపొందించాలని కోరారు.వడ్డెర కుటుంబాలకు భూమి, గృహాలు, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు సంప్రదాయ వృత్తిని కొనసాగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సమావేశంలో నాయకులు కోరారు. వడ్డెరల బతుకులు రాయితో ముడిపడి ఉన్నాయని, ఆ రాయిని దూరం చేస్తే వారి జీవనాధారం కూడా దూరమవుతుందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అధ్యక్షుడు దుర్గ సాయిలు, కొల్చారం మండలం అధ్యక్షులు ఓర్స ఈశ్వర్, దారంగుల ఎల్లయ్య, ఎత్తరి పెంటయ్య, వల్లపు శ్రీనివాస్, సంపంగి రమేష్, జరుపటి రాజు, హనుమంతు, వెంకటేశం, యాదగిరి, నిఖిల్, రమేష్, ఎల్లేష్, కుమార్, నాగయ్య, శివరాములు, పోచయ్య, నాగరాజ్, వీరేశం వడ్డెర నాయకులు తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955